


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684


| మేడ్చల్-మల్కాజ్ గిరి | శనివారం | 15.08.2026 | సంపుటి: 3 | సంచిక: 193 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 15.08.2026 | VOLUME : 3 | ISSUE : 193 | PAGES: 8 | COST: 2/- |

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

## 78 శౌర్య పురస్కారాలు

- సైనికుల ధైర్యసాహసాలకు రాష్ట్రపతి గౌరవం
- 13 మందికి మరణానంతరం పురస్కారాలు
- 9 కీర్తి చక్రాలు.. 19 శౌర్య చక్రాలు
- 89 'మెన్షన్స్ ఇన్ డిస్పాచెస్'కు కూడా గుర్తింపు

4



## నక్సల్స్ రహిత భారత్ దిశగా భారీ విజయం


- 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేళ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశం
- 'ఆపరేషన్ సిందూర్'తో సైనిక శక్తి చాటాం
- సామాన్యులకు సత్వర న్యాయం అందాలి
- అభివృద్ధితో దేశం మరింత ముందుకు సాగాలి

4



## రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎదురుదాడి

- విదేశాంగ విధానంపై కాంగ్రెస్ నేత వ్యాఖ్యలకు కౌంటర్
- ఇందిరా గాంధీ, మోదీ ఆలింగనాల ఫొటోలు షేర్ చేసిన బీజేపీ ఎంపీ
- 'ఎప్పుడు పరిణతి చెందుతారు?' అంటూ ప్రహ్లాద్ జోషి విమర్శ
- మెలోనీ ప్రస్తావనపై బీజేపీ నేతల ఆగ్రహం



4

## డిసెంబర్ 7నుంచి గ్లోబల్ సమ్మిట్



- ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు
- క్యూర్ పరిధిలో ఆటోలను ఈవీలుగా మార్చేందుకు పథకం
- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు
- ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం.. ప్రచారం
- మక్తల్-నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతలకు రూ.2,100 కోట్ల అంచనా
- కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం

3

## విద్యతోనే సామాజిక చైతన్యం

- మహనీయుల స్ఫూర్తితో విద్యావంతులు కావాలి
- జ్యోతి బాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ సభలో సీఎం

2



# టార్గెట్ బ్రదర్స్..



- టెస్సరాక్ట్ భూముల వివాదం..
- రేవంత్ కుటుంబం లక్ష్యంగా బీఆర్ఎస్
- కేటీఆర్ వ్యూహంతో సీఎం సోదరులపై రాజకీయ దాడి
- భూ కేటాయింపులపై తీవ్ర ఆరోపణలు
- కాంగ్రెస్ నుంచి పరిమిత స్పందనపై చర్చ
- కొండల్ రెడ్డికి కంపెనీతో సంబంధాలపై స్పష్టతకు డిమాండ్
- ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యమంటున్న బీఆర్ఎస్
- లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, ఆగస్టు 14:

టెస్సరాక్ట్ భూముల కేటాయింపు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కొత్త వివాదానికి దారితీసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు రాజకీయంగా వేడి పెంచుతున్నాయి. సీఎం సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిలను కేంద్రంగా చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

**టెస్సరాక్ట్ భూములపై ఆరోపణలు**

టెస్సరాక్ట్ కంపెనీకి విలువైన ప్రభుత్వ భూములను

మిగతా 2వ పేజీలో..

## నేరాల స్వరూపం మారుతోంది

- సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో అవేర్‌నెస్
- రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన
- డీజీపీ ఆనంద్ వెల్లడి

2






2

## తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

## సీఎం కనుసన్నల్లో నిషేధిత జాబితా

3





## పుష్కరాల పనులు త్వరగా మొదలవ్వాలి

- ఈ నెలాఖరుకు టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సిందే
- నాణ్యతలో రాజీ పడొద్దు.. శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి
- గోదావరి పుష్కరాలపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు

3

## టీడీఆర్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

2





## ములుగు నుంచి తొలి అడుగు..

- రాష్ట్ర గ్రామీణ రహదారుల అభివృద్ధికి ములుగు జిల్లా వేదిక
- రూ.16,007 కోట్ల భారీ ప్రణాళికకు ఈనెల 16న శ్రీకారం
- పైలాన్ ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2



## యూనిఫాం ఉద్యోగాలకు ఏడేళ్ల వయో సడలింపు

- నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు
- గత ఐదేళ్ల సడలింపునకు అదనంగా మరో రెండేళ్లు
- పోలీసు, ఎక్సైజ్, అటవీ సహా పలు శాఖలకు వర్తింపు
- రాబోయే ప్రత్యక్ష నియామకాల్లో ప్రయోజనం
- అభ్యర్థుల విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూల స్పందన

2

## ప్రతీ వ్యక్తికి భరోసాగా మా పాలన

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- రాష్ట్ర, దేశ ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు



హైదరాబాద్, ఆగస్టు 14 :

ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా మనకు లభించిన స్వాతంత్య్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవంతో జీవించేలా, ప్రతి రైతు సంతోషంగా ఉండేలా, ప్రతి యువతకు భవిష్యత్‌పై భరోసా కలిగేలా తెలంగాణను అభివృద్ధి

మిగతా 2వ పేజీలో..

## యూనిఫాం ఉద్యోగాలకు
# ఏడేళ్ల వయో సడలింపు

**హైదరాబాద్, ఆగస్టు 15:**
తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. పోలీసు, ఫైర్ సర్వీసెస్, జైళ్లు, ఎస్పీఎఫ్, ఎక్సైజ్, రవాణా, అటవీ శాఖల్లోని యూనిఫాం ఉద్యోగాల నియామకాలకు గరిష్ట వయోపరిమితిని మరో రెండేళ్లు పెంచింది. ఇప్పటికే ఇచ్చిన ఐదేళ్ల సడలింపునకు ఈ రెండేళ్లను అదనంగా కలపడంతో మొత్తం ఏడేళ్ల వయోపరిమితి సడలింపు లభించనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**అభ్యర్థుల విజ్ఞప్తితో..**
యూనిఫాం ఉద్యోగాల వయోపరిమితి ముగియడంతో నియామక పరీక్షలకు దూరమవుతున్నామని నిరుద్యోగ అభ్యర్థులు చాలాకాలంగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నారు. వారి అభ్యర్థనలను పరిశీలించిన ప్రభుత్వం అదనంగా మరో రెండేళ్ల సడలింపు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ఏడాది మే 18న జారీ చేసిన జీవో నంబర్ 87 ద్వారా ఇప్పటికే ఐదేళ్ల సడలింపు కల్పించగా.. తాజాగా దానికి మరో రెండేళ్లు జత చేసింది.

**పలు శాఖల్లో ప్రత్యక్ష నియామకాలకు..**
తాజా ఉత్తర్వుల ప్రకారం పోలీసు, ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఎక్సైజ్, రవాణా, అటవీ శాఖల్లోని యూనిఫాం పోస్టుల ప్రత్యక్ష నియామకాలకు ఈ సడలింపు వర్తించనుంది. రాబోయే నియామకాల్లో వయోపరిమితి కారణంగా అవకాశాన్ని కోల్పోయే అభ్యర్థులకు ఇది ప్రయోజనం కల్పించనుంది.

**రిక్రూట్‌మెంట్ సంస్థలకు ఉత్తర్వులు**
ప్రభుత్వ తాజా నిర్ణయానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించాలని ఆదేశించారు. ఉత్తర్వుల ప్రతులను తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖాధిపతులకు పంపించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాబోయే పోలీసు, ఇతర యూనిఫాం ఉద్యోగాల నియామకాల్లో పోటీ పడేందుకు మరింత మంది నిరుద్యోగులకు అవకాశం లభించనుంది.

## టీడీఆర్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్,ఆగస్ట్ 14:**
ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్)పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీడీఆర్ జారీ, వినియోగ నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జివో 218 ద్వారా తెలంగాణ బిల్డింగ్ రూల్స్2012లో సవరణలు చేసింది. దీని ద్వారా హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ పరిధిలో టీడీఆర్ వినియోగానికి మరింత వెసులుబాటు కల్పించినట్లైంది. నూతన జీవో ప్రకారం ఇకపై హెచ్ఎండీఏ చేపట్టే ప్రాజెక్టుల కోసం అవసరమైన/స్వాధీనం చేసుకున్న భూములకు ఆ సంస్థే టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ చేయనుంది. జీహెచ్ఎంసి పరిధి సహా సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ప్రజా ప్రయోజన/ప్రాజెక్టుల కోసం ఇచ్చే భూములకూ ఈ నియమం వర్తించనుంది. హెచ్ఎండీఏ జారీ చేసే టీడీఆర్ సర్టిఫికెట్‌ను ఆ సంస్థ పరిధిలో ఎక్కడైనా వినియోగించుకోవచ్చు/డిస్పోజ్ చేసుకోవచ్చు. అలాగే టీడీఆర్ జారీ పక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. అదేవిధంగా టీడీఆర్‌కు సంబంధించిన వివరాలు, లెక్కలు, వినియోగంపై ఏకరీతి విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. ఈ మేరకు సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్లకు టీడీఆర్ సర్టిఫికెట్ కాపీ అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. బిల్డ్ నౌ వ్యవస్థలో టీడీఆర్ ప్రాసెసింగ్, జారీ, అకౌంటింగ్, వినియోగానికి అవసరమైన మార్పులూ చేసింది. గెజిట్‌లో ప్రచురించిన తేదీ నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది.

## ప్రతీ వ్యక్తికి భరోసాగా మా పాలన

**మొదటిపేజీ తరువాయి**
పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తున్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర, దేశ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు అండగా రైతుభరోసా, మహిళల ఆర్థిక సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదవాడి ఇంట్లో వెలుగు నిండినప్పుడే స్వాతంత్ర్యానికి నిజమైన అర్థం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం గౌరవంగా జీవించే తెలంగాణ నిర్మాణమే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి ఫలాలు చివరి పేదవాడి ఇంటికి చేరినప్పుడే అభివృద్ధికి అసలైన అర్థం ఉంటుందన్నారు. అలా అందించాలనే కృతనిశ్చయంతో ప్రజా ప్రభుత్వ పనిచేస్తోందని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సమానత్వం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో మరింత బలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజల ఆశీస్సులతో.. పేదల ముఖాల్లో చిరునవ్వులు, ప్రతి ఇంటా వెలుగులు నింపే దిశగా మన ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం మరింత బలంగా ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి తెలంగాణ కుటుంబంలో కొత్త ఆశలు, కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

## తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

- **మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు**

**హైదరాబాద్, ఆగస్టు 14:**
తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు. ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్‌స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు. బి.సత్యారావు, కె.సందీప్ కుమార్, జె.వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధారణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం దక్కింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో ఇద్దరిని ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఇక విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది.




# విద్యతోనే సామాజిక చైతన్యం

- **మహనీయుల స్ఫూర్తితో విద్యావంతులు కావాలి**
- **ఈసారి అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తాం**
- **నైపుణ్యం ఉంటేనే ఉద్యోగావకాశాలు**
- **అందుకే విద్యావ్యవస్థలో సంస్కరణలు**
- **ఇంత మంచి ప్రభుత్వం మళ్లీ రాదు**
- **జ్యోతి బాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ సభలో సీఎం**

**హైదరాబాద్, ఆగస్టు 14 :**
చదవు ఒక్కటే ఆత్మగౌరవాన్ని, గుర్తింపును ఇస్తుంది.. తలెత్తుకునేలా చేస్తుంది.. కుల నిర్మూలన జరగాలన్నా సామాజిక చైతన్యం రావాలన్నా అందరూ కలిసి కట్టుగా చదువుకోవడం, జీవించడం ద్వారా సాధ్యం అవుతుంది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకే ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తీసుకొస్తున్నామన్నారు. నెక్లెస్ రోడ్డులో జ్యోతి బాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. ఒక వైపు అంబేద్కర్, మరో వైపు ఇందిరా గాంధీ, ఇంకో వైపు పీవీ నరసింహారావు, మరో వైపు జ్యోతి బాపూలే విగ్రహాలను ఇక్కడ ఆవిష్కరించుకున్నామని, వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలని పిలుపునిచ్చారు. నెక్లెస్ రోడ్డు చౌరస్తా ఇప్పుడు అద్భుతమైన చౌరస్తాగా మారిందన్నారు. 150 యేళ్ల క్రితం జ్యోతి బాపూలే చదువు ఒక్కటే మార్గమని, తను చదువుకోవడమే కాక తన సతీమణిని చదివించడం ద్వారా ఆదర్శంగా నిలబడ్డారని గుర్తు చేశారు. ఈ తరం కూడా ఆదర్శ పురుషుడిగా ఆయనను స్మరించుకుంటున్నామంటే అది వారి ఆలోచనా గొప్పతనం అని అన్నారు. తమ ప్రభుత్వంలో జ్యోతి బాపూలే ఆలోచనలను కొనసాగిస్తున్నామంటూ విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. నర్సరీ నుంచి బ్రేక్ ఫాస్ట్‌తోపాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని, ఈ విద్యా సంవత్సరం నుంచి రూ.2400 కోట్ల ఫీజు రీయింబర్స్‌ను అడ్వాన్స్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తున్నామని సీఎం వివరించారు. ఏటా రూ.2300 వేల కోట్లను విద్యార్థుల ఖాతాల్లోకి ఫీజు రీయింబర్స్‌మెంట్ వేస్తామని, ఆన్‌లైన్‌లో అప్లై చేసుకుంటే నెలలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల ఖాతాల్లో పడుతుందని చెప్పారు. ఫీజులు కట్టలేదని సర్టిఫికెట్లు ఇవ్వమని ఏ కాలేజీ చెప్పకుండా ముందుగానే ఫీజులు చెల్లిస్తామన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు విద్యతోపాటు స్కిల్స్ నేర్పిస్తున్నామని తెలిపారు. సర్టిఫికెట్లు ఉంటే సరిపోదు.. స్కిల్స్ ఉంటే ఉపాధి లభిస్తుంది అని స్పష్టం చేశారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో రూ.2 లక్షలతో నర్సింగ్ ఉద్యోగాలు సిద్ధంగా ఉన్నాయి.. సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకోవాలి.. ఐటీ నిపుణులు కూడా ఉద్యోగాలు పోయి వెనక్కి వస్తున్నారు అని అన్నారు. 2024లో టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేశామని, వీటిల్లో చేరిన విద్యార్థులకు నెలకు రూ.2000 స్టైఫండ్ ఇస్తున్నామని, విద్యతోపాటు సాంకేతిక నైపుణ్యాన్ని నేర్పుతున్నామని సీఎం చెప్పారు. గ్రూప్1 నియామకాలు చేపడితే అందులో 60 శాతం మంది బీసీలు ఉన్నారు.. ఇప్పుడు నూటికి నూరు మార్కులు వచ్చిన విద్యార్థులు 90 శాతం మంది ఉంటున్నారు.. విద్యతో పోటీ బాగా పెరిగిందన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాం.. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం.. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తున్నామని వివరించారు. క్రీడల్లో రాణించి పతకాలు తీసుకువస్తే నగదు నజరానాలతోపాటు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత నాది అని ఆయన హామీ ఇచ్చారు. చదువుకుంటేనే అవకాశాలు వస్తాయంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలి అని పిలుపునిచ్చారు. సామాజిక చైతన్యంతో ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు దశాబ్దాలు కొట్లాడారు.. మీ రేవంతన్న దేశంలోనే మొదటిసారి ఎస్సీ వర్గీకరణ చేసి సమస్యను పరిష్కరించారు అని చెప్పారు. బీసీ జనగణన చేయడానికి దేశంలో ఎవరూ ధైర్యం చేయలేదు.. కానీ మేం యేడాదిలో బీసీ జనగణన చేసి బీసీల లెక్క తేల్చాం అన్నారు. కులగణనలో భాగస్వామ్యం పంచుకోకుండా మాజీ ముఖ్యమంత్రులు, మాజీ వ్యతిరేకించారని విమర్శించారు. కులగణన చేసిన మొదటి రాష్ట్రం, చివరి రాష్ట్రం మనదే అన్నారు. బలహీనవర్గాలకు ఉద్యోగాలు కల్పించాలంటే వాళ్ల లెక్క ఉండాలి.. అందుకే కులగణన చేశామని చెప్పారు. ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ వెళ్తున్నామని, గత ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు పెంచుకోండి, చెప్పులు కుట్టుకోండి, చేపలు పట్టుకోమని చెప్పింది.. బీసీలు రాజ్యాధికారంలో భాగం అడుగుతారన్న ఉద్దేశంతోనే గొర్రెలు, బర్రెలు పెంచుకోమని చెప్పారని విమర్శించారు. ఈ సమాజం చదువుకోవద్దా.. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. చదవు ఒక్కటే తలరాతలు మారుస్తుంది.. తెలంగాణను మారుస్తుంది.. చదువు ఒక్కటే పరిష్కారం.. అదే మార్గం.. తెలంగాణను ప్రపంచ పటంలో పెట్టడానికి చదువే మార్గం అని ఉద్ఘాటించారు. జ్యోతి బాపూలేను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు చట్టసభల్లోకి రావాలి.. డాక్టర్లు, ఇంజనీర్లు కావాలి అని పిలుపునిచ్చారు. నాణ్యమైన విద్యను అందించే బాధ్యత నాది.. నాణ్యమైన విద్యను, పౌష్టికాహారాన్ని అందించే బాధ్యత నాది.. మీ బంగారు భవిష్యత్తు కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తా.. ఇంత మంచి అవకాశం మళ్లీ రాదు.. ఈ ప్రభుత్వాన్ని కొనసాగించాలి అని సీఎం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, అజరుద్దీన్, విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంత రావు, కె.కేశవ రావు, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, ఆర్ కృష్ణయ్య, సురేష్ షెట్కర్, ఎంఎల్ఏలు దానం నాగేందర్, నవీన్ యాదవ్మం, దుల సామేల్, మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్, ప్రకాష్ గౌడ్, శ్రీ గణేష్, బీసీ సంఘాల నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**మహనీయుల స్ఫూర్తితోనే కాంగ్రెస్ పాలన : భట్టి**
బలహీనవర్గాల ఆత్మగౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పూలే దంపతుల ఆశయాల సాధనకు కంకణం కట్టుకుని ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. విద్య, సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ పూలే ఆలోచనలను అమలు చేస్తున్నామన్నారు. సామాజిక అసమానతలను పారద్రోలి అణగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బతకాలనే లక్ష్యంతో జీవితాంతం కృషి చేసిన మహానుభావులు పూలే దంపతులని ఆయన కొనియాడారు. వారి విగ్రహాలను ఆవిష్కరించుకోవ□డం మనందరి అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బలహీనవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న స్పష్టమైన సందేశాన్ని ఇచ్చామన్నారు. పూలే ఆశయాలను మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేస్తున్న ఏకైక ప్రజా ప్రభుత్వం తమదేనని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో జ్యోతిరావు పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను కేవలం 300మందికే ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ సంఖ్యను 700కు పెంచినట్లు తెలిపారు. బీసీల రిజర్వేషన్ల అమలుకు శాస్త్రీయమైన గణాంకాలు అవసరమని గతంలో అనేకసార్లు న్యాయస్థానాలు చెప్పినప్పటికీ ఏ ప్రభుత్వమూ ఆ సాహసం చేయలేదన్నారు. కానీ, దేశంలో మరే రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రంలో శాస్త్రీయంగా కులగణన (సోషియో, ఎకనామిక్, పొలిటికల్ సర్వే) చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని భట్టి గుర్తుచేశారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో బలహీన వర్గాలు 56 శాతం ఉన్నారని తేల్చామని, ఈ శాస్త్రీయ గణాంకాల ఆధారంగానే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు లేవని సభలో ఆర్. కృష్ణయ్య ప్రస్తావించిన అంశంపై ఆయన స్పందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఏడాది కాలంలోనే ఒక్కో భవనానికి రూ.200 కోట్లు కేటాయించి రాష్ట్రవ్యాప్తంగా వంద ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పినట్లు వచ్చిన వెంటనే రెసిడెన్షియల్ స్కూళ్లలో డైట్ చార్జీలు 40శాతం, కాస్మెటిక్ చార్జీలు 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకునేది వారి మార్గంలో ప్రయాణించి, వారు చెప్పిన సిద్ధాంతాలను అమలు చేసేందుకు, స్ఫూర్తి పొందడానికేనని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఆ మహానుభావుల స్ఫూర్తి ప్రస్తుత ప్రభుత్వ పాలనలో చాలా స్పష్టంగా కనిపిస్తోందంటూ వారి విగ్రహావిష్కరణలో పాలుపంచుకునే అవకాశం రావడం సంతోషం కలిగిస్తోందన్నారు.

# ములుగు నుంచి తొలి అడుగు..

- **రాష్ట్ర గ్రామీణ రహదారుల అభివృద్ధికి ములుగు జిల్లా వేదిక**
- **రూ.16,007 కోట్ల భారీ ప్రణాళికకు ఈనెల 16న శ్రీకారం**
- **పైలాన్ ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్ట్ 14 :**
రాష్ట్ర గ్రామీణ రవాణా రంగంలో సరికొత్త అధ్యాయానికి ములుగు జిల్లా వేదిక కానుంది. గ్రామాలు, మండల కేంద్రాలు, ప్రధాన రహదారుల మధ్య మెరుగైన అనుసం ధానం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టనున్న భారీ రహదారి అభివృద్ధి కార్యక్రమానికి ఈ నెల 16న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ములుగు నుంచి శ్రీకారం చుట్టనున్నారు. సుమారు రూ.16,007 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ కార్యక్రమానికి గుర్తుగా ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పైలాన్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తొలి దశలో 2,145 రహదారులను సుమారు 7,448 కిలో మీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. ప్రభుత్వం, బ్యాంకులు, నిర్మాణ సంస్థల భాగస్వామ్యంతో ఆర్థిక వన రులను సమకూర్చుకొని ఈ భారీ రహదారి కార్యక్రమాన్ని క్షేత్రస్థా యిలో కార్యరూపంలోకి తీసుకురానున్నారు. రహదారుల నిర్మాణాన్ని హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టనున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత 15 సంవత్సరాల పాటు సంబంధిత నిర్మాణ సంస్థలే రహదారుల నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. ఈ బృహత్తర రహదారి అభివృద్ధి కార్యక్రమానికి ములుగు జిల్లా వేదిక కావడం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గం నుంచే ఆమె శాఖకు సంబంధించిన రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుండటం విశేషం. అటవీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలు అధికంగా ఉన్న ములుగు జిల్లాను ప్రారంభవేదికగా ఎంపిక చేయడం ద్వారా మారుమూల ప్రాంతాల రహదారి అనుసంధానానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం స్పష్టమవుతోంది.




## నేరాల స్వరూపం మారుతోంది

**హైదరాబాద్, ఆగస్టు 14 :**
నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోందని డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సురక్ష కా తిరంగా కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌ను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కొన్నేళ్ల క్రితం వరకు ఫిజికల్ దోపిడీలు జరిగేవని.. కానీ ఇప్పుడు నార్కోటిక్, సైబర్ నేరాలు పెరిగాయని వెల్లడించారు. నార్కోటిక్స్ బారినపడి విద్యార్థులు, యువకులు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారని చెప్పారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు ఎవరు ఏం అనుకుంటారోనని బయటకు కూడా చెప్పుకోవడం లేదని డీజీపీ అన్నారు. తాము 40 రకాల సైబర్ నేరాలను గుర్తించామని, ఇందులో ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఉంటున్నాయని వివరించారు. తాము ఎంత అడ్డుకట్ట వేస్తున్నా సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్తగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు.

# టార్గెట్ బ్రదర్స్..

**మొదటిపేజీ తరువాయి**
తక్కువ ధరకు కేటాయించారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఆ కంపెనీ వెనుక సీఎం సోదరుడు కొండల్ రెడ్డి ఉన్నారంటూ ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు. అధికారాన్ని ఉపయోగించి కుటుంబ సభ్యులకు ప్రయోజనం కల్పించారనే ఆరోపణలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

**కాంగ్రెస్ నుంచి పరిమిత స్పందన**
బీఆర్ఎస్ ఆరోపణలకు కాంగ్రెస్ నుంచి ఆశించిన స్థాయిలో ఎదురుదాడి కనిపించడం లేదన్న చర్చ జరుగుతోంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాత్రం భూ కేటాయింపులు నిబంధనల ప్రకారమే జరిగాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన పారిశ్రామిక విధానంలోని నిబంధనలనే ప్రస్తుత ప్రభుత్వం కూడా పాటిస్తోందని తెలిపారు.

**సంబంధాలపై స్పష్టతకు డిమాండ్**
టెస్సరాక్ట్ కంపెనీతో కొండల్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ నేతలు స్పష్టంగా ప్రకటించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. భూ కేటాయింపుల నిబంధనలపై మాత్రమే అధికార పక్షం వివరణ ఇస్తోందని, కంపెనీ యాజమాన్యంతో సీఎం సోదరుడికి సంబంధం ఉందా లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నిస్తోంది.

**కుటుంబ పాలన అంశాన్ని తెరపైకి**
టెస్సరాక్ట్ వివాదాన్ని రాజకీయంగా విస్తరించడం ద్వారా గతంలో బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ చేసిన కుటుంబ పాలన, అవినీతి ఆరోపణలను తిరిగి ఆ పార్టీపైకి మళ్లించాలన్న వ్యూహంతో కేటీఆర్ ముందుకు వెళ్తున్నారని రాజకీయ వర్గాల్లో విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సీఎం కుటుంబంపై ఆరోపణల ద్వారా ప్రభుత్వంపై ప్రతికూలత పెంచడమే లక్ష్యమని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నట్లు చర్చ సాగుతోంది.

**లోకాయుక్తకు బీఆర్ఎస్ ఫిర్యాదు**
టెస్సరాక్ట్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు కేటాయించారంటూ బీఆర్ఎస్ నేతలు లోకాయుక్తను ఆశ్రయించారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డిలతో కూడిన బృందం శుక్రవారం ఫిర్యాదు చేసింది. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని సుమారు రూ.7 కోట్లకే కేటాయించారని ఆరోపించింది.
భూ కేటాయింపులను రద్దు చేసి, ఈ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి పాత్రపై విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఆరోపణలకు ప్రభుత్వం పత్రాలు, భూ కేటాయింపు నిబంధనలు, కంపెనీ యాజమాన్య వివరాలతో స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# డిసెంబర్ 7నుంచి 'గ్లోబల్ సమ్మిట్'

**హైదరాబాద్, ఆగస్టు 14 :**

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాక ఇప్పటివరకు స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో శుక్రవారం జరిగింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి డియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతోపాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు, వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు పక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**మరో ఏడు స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు**

ఈ సమావేశంలో కొత్తగా ఆమోదించిన ఏడు స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలో నగరంలో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలున్నాయి. వీటిని విద్యుత్తు వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం అమలుకు ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50లక్షల సబ్సిడీ అందించాలని కేబినెట్ నిర్ణయించింది. హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మక్తల్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల ఫేజ్ 2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందనుంది. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతోపాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# సీఎం కనుసన్నల్లో నిషేధిత జాబితా

**హైదరాబాద్, ఆగస్టు 14 :**

తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగా కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి స్పష్టత వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారన్నారు. ఇది నేరుగా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు చేశారు. భూముల విలువ ఎక్కువగా ఉన్న చోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమేనని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డులపై మోదీ ఫొటో పెట్టాలి

- అన్ని సరుకులను ప్రజలకు ఇవ్వాలి
- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద అధిక మొత్తంలో ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని ఆక్షేపించారు. రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని కోరారు. పెంచిన రేషన్ డీలర్ల కమీషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల ద్వారా పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని, బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ డిమాండ్ చేశారు.

# నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం

- ఆ విషయమే చెప్పాను తప్ప ఎవ్వరినీ నొప్పించలేదు
- మరోమారు స్పష్టం చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్

**యాదాద్రి, ఆగస్టు 14 :**

కాంగ్రెస్‌లో బయటనుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం చేసిన ఈ వ్యాఖ్యలపై శుక్రవారం మరోసారి మీడియాకు ఆయన స్పష్టత ఇచ్చారు. యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా పార్టీ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణచి వేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర వి□డియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పనిచేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల□", సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు.

**రాజగోపాల్ వ్యాఖ్యలు సరికాదు :**
**పీసీసీ చీఫ్ మహేష్ పీసీసీ**



కాంగ్రెస్ పార్టీలో సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. 'రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం. .పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడద'ని హితవు పలికారు. రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు. గీత దాటి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడటం సరికాదు. సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి వెళ్తుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయట్లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేనివాళ్లు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారన్న రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

# స్మార్ట్‌గా మారుతోన్న ప్రజా పంపిణీ వ్యవస్థ

- ట్యాంపరింగ్‌కు అవకాశం లేని కొత్త స్మార్ట్ రేషన్ కార్డు
- నేడు సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా విడుదల

**సంగారెడ్డి, ఆగస్టు 14 :**

ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత స్మార్ట్‌గా మారుతోంది. పంద్రాగస్టును పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డి సంగారెడ్డిలో శనివారం స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనున్నారు. అదేరోజు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్డులు అందచేస్తారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలించారు. 12 ఏళ్లకు పైగా జిరాక్స్ కాగితాలే రేషన్ కార్డులుగా ఉపయోగపడుతుండగా అవి చినిగిపోతూ ఇబ్బందిపడుతున్న లబ్దిదారులు రేషన్‌కార్డులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పంద్రాగస్టు రోజు నుంచి సరికొత్త హంగులతో పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను అందించడానికి శ్రీకారం చుట్టింది. సంగారెడ్డిలో సీఎం లాంఛనంగా ప్రారంభించిన వెంటనే లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఎలాంటి ట్యాంపరింగ్ చేయడానికి వీలులేని విధంగా ఏటీఎం, పాన్‌కార్డు మాదిరిగా డిజిటలైజేషన్, స్మార్ట్ టెక్నాలజీ ఆధారితంగా పంపిణీ చేసే పీవీసీ కార్డు, చిప్, బార్‌కోడ్, డిజిటల్ వెరిఫికేషన్ వంటి టెక్నాలజీతో స్మార్ట్ రేషన్ కార్డులు ముద్రించారు.

# బావమరిది మృతికి కేసీఆర్ సంతాపం

- భౌతికి కాయం వద్ద నివాళులు

**హైదరాబాద్, ఆగస్ట్ 14 :**

అనారోగ్యంతో మరణించిన తన బావమరిది జోగినపల్లి శ్రీనివాస్ రావు పార్థీవ దేహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. ఎర్రవల్లి నుంచి నేరుగా సుచిత్రలోని శ్రీనివాస్‌రావు నివాసానికి చేరుకున్న కేసీఆర్ నివాళులు అర్పించిన అనంతరం శోకతప్తులైన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామన్నారు. ఆయన వెంట కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కాగా, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు.



# పుష్కరాల పనులు త్వరగా మొదలవ్వాలి

**హైదరాబాద్, ఆగస్టు 14 :**

గోదావరి పుష్కరాలు2027 నిర్వహణను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. టెండర్ ప్రక్రియను ఈనెలాఖరుకు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ శ్రీధర్‌బాబు అధ్యక్షతన గోదావరి పుష్కరాలుపై సచివాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వేయి కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలా అని నాణ్యతలో రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్‌ను రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు ఆయన సూచించారు. అన్ని శాఖలు సమష్టిగా పనిచేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతమవుతాయన్నారు. భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలన్నారు. ఎక్కడైనా రోడ్ల కనెక్టివిటీ మిస్ అయితే వెంటనే గుర్తించి లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. కేబినెట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, దనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఆర్టీసీ ప్రాథమిక కార్యాచరణ నివేదికపై సమీక్ష**

పుష్కరాల సందర్భంగా పాత ఐదు జిల్లాల్లోని 85 పుష్కర ఘాట్లు, వాటికి సమీపంలో ఉన్న 22 ఆర్టీసీ బస్ స్టేషన్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని ప్రతిపాదించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్ స్టేషన్లలో భవనాలు, ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల సౌకర్యాలు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, రోడ్లు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సి ఉంది. డిజాస్టర్ బోట్స్, రెస్క్యూ టీమ్స్, హైడ్రా వంటి బృందాలు సమన్వయం చేసుకునేల ఏర్పాటు చేయాల్సి ఉంది. ఒక్కో బస్ స్టేషన్ అభివృద్ధికి సుమారు రూ.3 కోట్లు అవసరమని, 22 బస్ స్టేషన్లకు మొత్తం రూ.66 కోట్లు అవసరం ఉందని అంచనా వేశారు. పెరిగే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక బస్ షెల్టర్లు, ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతాలు, పార్కింగ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. ఒక్కో ప్రాంతానికి సుమారు రూ.కోటి చొప్పున 22 ప్రాంతాలకు మొత్తం రూ.22 కోట్లు అవసరమని అంచనా. శాశ్వత ఆర్టీసీ బస్ స్టేషన్లు లేని ప్రాంతాల్లో తాత్కాలిక బస్ స్టేషన్లు, ప్రయాణికుల హోల్టింగ్ ఏరియాలు, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.

**మొత్తం మౌలిక వసతుల వ్యయం**

బస్ స్టేషన్ల ఆధునికీకరణకు రూ.66 కోట్లు, తాత్కాలిక బస్ షెల్టర్లు, ఇతర సౌకర్యాలకు రూ.22 కోట్లు మొత్తం రూ.88 కోట్లు అవసరం. మహాలక్ష్మి పథకం అమలులో ఉన్నందున ఆర్టీసీ బస్సులకు ప్రస్తుతం మహిళా ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉంది. పుష్కరాల సమయంలో మరింత రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున గత పుష్కరాలతో పోలిస్తే సుమారు 30% అదనంగా బస్సులను నడపాలని ప్రతిపాదించారు. ప్రయాణికుల డిమాండ్‌నుబట్టి ఘాట్లు - ఆర్టీసీ బస్ స్టేషన్ల మధ్య కనెక్టివిటీ పెంచుతారు. అత్యధిక రద్దీ ఉండే రోజుల్లో ప్రత్యేక కార్యాచరణ తీసుకుంటారు. పార్కింగ్ ప్రాంతాలు, తాత్కాలిక బస్ షెల్టర్లు, ఘాట్ల మధ్య షటిల్ బస్సులు ఏర్పాటు చేస్తారు. అన్ని గుర్తించిన ఘాట్లు, సంబంధిత బస్ స్టేషన్లు, దూరాలు, రోడ్డు మార్గాలు, కనెక్టివిటీ వివరాలతో సమగ్ర రూట్ మ్యాప్ రూపొందిస్తారు.

**ఆర్టీసీ ముందస్తు కార్యాచరణ**

పుష్కరాల సందర్భంగా భక్తుల రవాణా సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసింది. రాష్ట్రం నలుమూలల నుండి బస్సుల నడపడమే కాక ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ నుండి వచ్చే భక్తులకు ప్రజా రవాణాలో ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నది. టీజీఎస్ ఆర్టీసీ వివిధ రీజియన్ల పరిధిలోని పుష్కర ఘాట్లు, వాటికి కేటాయించిన బస్సు డిపోలు, ప్రణాళిక ప్రకారం బస్సులు, ట్రిప్పులు, ఘాట్ల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలు ఇలా ఉన్నాయి.కరీంనగర్ రీజియన్ పరిధిలో ప్రధాన ఘాట్లు : ధర్మపురి, ఎర్దండి, కాళేశ్వరం, వాల్గొండ.

డిపోలు: గోదావరిఖని, హుస్నాబాద్, హుజురాబాద్, జగిత్యాల, కరీంనగర్1, కరీంనగర్2, కోరుట్ల, మంథని, సిరిసిల్ల, వేములవాడ. పుష్కరాల్లో భాగంగా ధర్మపురి, కాళేశ్వరంలకు అత్యధిక సంఖ్యలో బస్సులు, ట్రిప్పులను ప్రణాళిక సిద్ధం చేశారు.

నిజామాబాద్ రీజియన్ ప్రధాన ఘాట్లు : పోచంపాడ్, కందకుర్తి, తడపాకల, దొంచంద, గుమిర్యాల్, సావేల్, తుంగిని, ఉమ్మెడ, బాసర, తాడ్బిలోలి, కోస్లీ, బినోలా. డిపోలు: ఆర్మూర్, కామారెడ్డి, నిజామాబాద్ 1, బాన్స్ వాడ, బోధన్ కల్పించాల్సిన సౌకర్యాలు: పోచంపాడ్, కందకుర్తి, దొంచంద, తాడ్బిలోలి తదితర ప్రాంతాల్లో నీరు, విద్యుత్ దీపాలు, బల్లలు టెంట్లు

ఆదిలాబాద్ రీజియన్ ప్రధాన ఘాట్లు : బాసర, ముధోల్, నిర్మల్, ఖానాపూర్, మంచేరియల్, జెన్నారం, లక్సెట్టిపేట మొదలైనవి డిపోలు : భైంసా, హైదరాబాద్, సికింద్రాబాద్ నగరానికి చెందిన సిటీ బస్సులు, నిర్మల్, మంచిర్యాల

విశేషం : బాసర పుణ్యక్షేత్రానికి హైదరాబాద్, సికింద్రాబాద్ నగర డిపోలతోపాటు భైంసా డిపో నుండి అధిక సంఖ్యలో ప్రత్యేక బస్సులు కేటాయించారు.

వరంగల్ రీజియన్ ప్రధాన ఘాట్లు : కాళేశ్వరం, రామన్నగూడెం, మంగపేట, ముళ్లకట్టు.

డిపోలు: హనుమకొండ, నర్సంపేట, తొర్రూరు, జనగామ, పరకాల, భూపాలపల్లి

కల్పించాల్సిన సౌకర్యాలు : కాళేశ్వరం ప్రాంతంలో ప్రయాణికుల రద్దీ కోసం తాత్కాలిక బస్ స్టేషన్ ఏర్పాటు.

ఖమ్మం రీజియన్ ప్రధాన ఘాట్లు : భద్రాచలం, పర్ణశాల, రామానుజవరం, చినరావిగూడెం, మోతేగడ్డ, దుమ్ముగూడెం, ఎదుళ్ల బయ్యారం, కొత్తగూడెం, చింతిర్యాల, నెల్లిపాక.

సంబంధిత డిపోలు: ఖమ్మం, మణుగూరు, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, మధిర భద్రాచలం

విశేషం: భద్రాచలం, పరిసర ప్రాంతాల ఘాట్లకు భక్తులు సులువుగా చేరుకునేలా మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం డిపోల ద్వారా విస్తృత బస్సు సర్వీసులు సిద్ధం చేశారు.

**ఘాట్ల వద్ద ఆర్టీసీ చేయనున్న ప్రాథమిక ఏర్పాట్లు, అవసరాలు**

తాగునీరు : నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని కందకుర్తి, పోచంపాడ్, తాడ్బిలోలి వంటి ప్రధాన ఘాట్ల వద్ద ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం. ఎండ, వర్షం నుండి భక్తులను కాపాడేందుకు టెంట్లు, విశ్రాంతి తీసుకోవడానికి బల్లల ఏర్పాటు. ఘాట్లు, బస్ పాయింట్ల వద్ద రాత్రి సమయంలో రక్షణ కోసం వెలుగునిచ్చే హైమాస్ట్ లైట్ల నిర్వహణ.

**తాత్కాలిక బస్ టెర్మినల్స్**

కాళేశ్వరం, ఇతర కిక్కిరిసిన ప్రదేశాల్లో బస్సులు నిలపడానికి, ప్రయాణికులు సులువుగా ఎక్కడానికి ప్రత్యేక తాత్కాలిక బస్ స్టేషన్ల ఏర్పాటు





# ఎర్రకోట వద్ద బాంబు దాడులకు పాల్పడతాం

- బెదిరింపు ఈ-మెయిల్
- అప్రమత్తమైన భద్రతా బలగాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 14 :

దేశ రాజధాని రేపటి స్వాతంత్ర్య దిన వేడుకలకు సిద్ధమవుతోన్న వేళ దిల్లీలో తీవ్ర కలకలం రేగింది. దిల్లీ హైకోర్టుకు వచ్చిన ఒక బెదిరింపు ఈమెయిల్ భద్రతా దళాలను, పోలీసులను ఉలిక్కిపడేలా చేసింది. ఎర్రకోట వద్ద ప్రధాని నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించే సమయంలోనే దాడులకు పాల్పడతామని ఆగంతకులు ఆ మెయిల్‌లో హెచ్చరించడం సంచలనంగా మారింది. ఆగస్టు 15న ఎర్రకోట లక్ష్యంగా బాంబు పేలుళ్లకు పాల్పడతామని మెయిల్‌లో పేర్కొన్నారు. ఉగ్రవాదులు లేదా అసాంఘిక శక్తులు పోలీసు యూనిఫామ్‌లో ఎర్రకోట ప్రాంగణంలోకి ప్రవేశించి ఈ దాడులకు పాల్పడే అవకాశం ఉందని వెల్లడించారు. దేశ ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవ సందేశమిచ్చే అత్యంత కీలక సమయంలోనే ఈ పేలుళ్లు జరుపుతామని సవాలు విసిరారు. 1984లో జరిగిన సిక్కు వ్యతిరేక హింసాకాండకు బాధ్యులైన రాజకీయ నేతలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డిమాండ్ చేశారు. బెదిరింపు ఈమెయిల్ రాగానే దిల్లీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, ఇంటెలిజెన్స్ వర్గాలు తక్షణమే రంగంలోకి దిగాయి. స్వాతంత్ర్య దిన వేడుకలు జరిగే ఎర్రకోట పరిసర ప్రాంతాలలో భద్రతను అత్యున్నత స్థాయికి పెంచారు. ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, దీని వెనుక ఉన్న ఐపీ అడ్రస్ ఏంటనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ వేగవంతం చేశారు. పోలీస్ డ్రస్‌లో వస్తారన్న హెచ్చరికల నేపథ్యంలో భద్రతా విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరి గుర్తింపు కార్డులను పునఃపరిశీలించడం, తనిఖీలు చేపట్టడం ప్రారంభించారు.





# రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎదురుదాడి

- విదేశాంగ విధానంపై కాంగ్రెస్ నేత వ్యాఖ్యలకు కౌంటర్
- ఇందిరా గాంధీ, మోదీ ఆలింగనాల ఫొటోలు షేర్ చేసిన బీజేపీ ఎంపీ
- 'ఎప్పుడు పరిణతి చెందుతారు?' అంటూ ప్రహ్లాద్ జోషి విమర్శ
- మెలోనీ ప్రస్తావనపై బీజేపీ నేతల ఆగ్రహం
- రాహుల్ వ్యాఖ్యలు అనుచితమంటూ బన్సూరీ స్వరాజ్ మండిపాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 14:

ప్రధాని నరేంద్ర మోదీ విదేశాంగ విధానంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. విదేశీ దేశాల నేతలను కౌగిలించుకోవడం విదేశాంగ విధానం కాదంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. కాంగ్రెస్ జాతీయ సదస్సులో రాహుల్ చేసిన వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే పాత ఫొటోలు, వీడియోలతో సమాధానం ఇచ్చారు.

**ఇందిరా ఫొటోలతో కౌంటర్**

రాహుల్ వ్యాఖ్యలకు స్పందిస్తూ నిశికాంత్ దూబే సామాజిక మాధ్యమంలో పలు ఫొటోలను పంచుకున్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ క్యూబా విప్లవ నేత ఫిడెల్ కాస్ట్రో, పాలస్తీనా నాయకుడు యాసర్ అరాఫత్‌లను ఆలింగనం చేసుకున్న దృశ్యాలను అందులో ఉంచారు. 2018లో లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రధాని మోదీని ఆలింగనం చేసుకున్న ఫొటోను కూడా ఆయన షేర్ చేశారు.

**మోదీని అవమానించారంటూ..**

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కూడా రాహుల్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. రాహుల్ గాంధీ ఎప్పుడు పరిణతి చెందుతారని ప్రశ్నించారు. వరుసగా మూడుసార్లు మోదీకి ప్రజలు అధికారం అప్పగించారని, ప్రధానిని అవమానించడం ద్వారా కోట్లాది మంది ఓటర్ల తీర్పును అవమానిస్తున్నారని విమర్శించారు. వంశపారంపర్య రాజకీయాలను ప్రజలు తిరస్కరించిన విషయాన్ని రాహుల్ గుర్తించాలని అన్నారు.

**మెలోనీ ప్రస్తావనపై వివాదం**

ఢిల్లీలో గురువారం జరిగిన కాంగ్రెస్ క్రియేటివ్ కాంగ్రెస్ జాతీయ సదస్సులో రాహుల్ గాంధీ విదేశాంగ విధానంపై ప్రధాని మోదీని విమర్శించారు. విదేశీ నేతలను కౌగిలించుకోవడమే విదేశాంగ విధానం అన్న ఆలోచన ప్రధానికి ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని అన్నారు. అనంతరం కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌ను కౌగిలించుకున్నారు. దీనిపై సందీప్ దీక్షిత్ ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ప్రస్తావిస్తూ వ్యాఖ్య చేయగా.. తాను ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదని రాహుల్ బదులిచ్చారు.

**భాషపై బీజేపీ అభ్యంతరం**

మెలోనీ ప్రస్తావనతో కూడిన రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ బన్సూరీ స్వరాజ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. రాహుల్ ఉపయోగించిన భాష అనుచితంగా ఉందంటూ విమర్శించారు. ప్రధాని మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ విమర్శల పరిధిని దాటాయని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు

# 78 శౌర్య పురస్కారాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 14:

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు దేశ రక్షణలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికులకు కేంద్ర ప్రభుత్వం గౌరవం ప్రకటించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 78 శౌర్య పురస్కారాలు, 89 'మెన్షన్స్ ఇన్ డిస్పాచెస్'కు ఆమోదం తెలిపారు. రాష్ట్రపతి భవన్ శుక్రవారం సాయంత్రం పురస్కారాల జాబితాను విడుదల చేసింది. మొత్తం 78 శౌర్య పురస్కారాల్లో 13 మందికి మరణానంతరం ఈ గౌరవం లభించనుంది. సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, కేంద్ర భద్రతా బలగాల సిబ్బంది ప్రదర్శించిన అసాధారణ తెగువకు ఈ పురస్కారాలు అందనున్నాయి.

**9 మందికి కీర్తి చక్రాలు**

శాంతికాలంలో ఇచ్చే రెండో అత్యున్నత శౌర్య పురస్కారమైన కీర్తి చక్రను ఈసారి తొమ్మిది మందికి ప్రకటించారు. ఆర్మీకి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ మాన్యో ఫ్రాన్సిస్, మేజర్ జితేంద్ర రాఠీ, హవల్దార్ గజేంద్ర సింగ్‌లకు ఈ గౌరవం దక్కనుంది. గజేంద్ర సింగ్‌కు మరణానంతరం పురస్కారం లభించనుంది. కేంద్ర భద్రతా బలగాలకు చెందిన హెడ్ కానిస్టేబుల్ జగ్బీర్ సింగ్, కానిస్టేబుల్ జస్వంత్ సింగ్, బల్విందర్ సింగ్, తారిఖ్ హుస్సేన్, హెడ్ కానిస్టేబుల్ బషీర్ అహ్మద్, ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్‌లకు కూడా కీర్తి చక్రాలు ప్రకటించారు.

**మేజర్ ఆదిత్యకు శౌర్య చక్ర బార్**

అస్సాం రైఫిల్స్‌కు చెందిన మేజర్ ఆదిత్య ప్రతాప్ సింగ్‌కు శౌర్య చక్ర బార్ లభించనుంది. గతంలో ఆయనకు శౌర్య చక్ర పురస్కారం లభించింది. అదే పురస్కారం మరోసారి దక్కినప్పుడు కొత్త పతకానికి బదులుగా ఇప్పటికే ఉన్న రిబ్బన్‌కు బార్‌ను జత చేస్తారు.

**19 మందికి శౌర్య చక్రాలు**

ఈ ఏడాది 19 మందికి శౌర్య చక్రాలను ప్రకటించారు. వీరిలో మేజర్ పరమవీర్, మేజర్ తరుణ్ వాసుదేవన్, నాయిబ్ సుబేదార్ శంకర్ రామ్, హవల్దార్ జగ్తార్ సింగ్, లాన్స్ నాయక్ నరేంద్ర సింధు ఉన్నారు. నరేంద్ర సింధుకు మరణానంతరం పురస్కారం లభించనుంది. నౌకాదళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ శివం కుమార్, వైమానిక దళానికి చెందిన స్క్వాడ్రన్ లీడర్ సుధీర్ కుమార్‌కు కూడా శౌర్య చక్రాలు ప్రకటించారు. కేంద్ర భద్రతా బలగాలకు చెందిన ఆరుగురికి ఈ పురస్కారం దక్కనుంది.

**36 మందికి సేనా పతకాలు**

ఐదుగురు అధికారులకు సేనా పతకం బార్లు, మరో 36 మందికి సేనా పతకాలను ప్రకటించారు. వీరిలో కల్నల్ పుష్కర్ విజయ్ చౌదరి, మేజర్ మోహిత్ పోడియా, కెప్టెన్ కరణ్ సింగ్ చీమా, కెప్టెన్ అన్షుమాన్ సింగ్, సుబేదార్ పవన్ కుమార్ ఉన్నారు. సుబేదార్ ప్రభాత్ గౌర్, లాన్స్ హవల్దార్ పలాష్ ఘోష్, సిపాయి హర్మిందర్ సింగ్ సహా ఐదుగురికి మరణానంతరం సేనా పతకాలు లభించనున్నాయి. నౌకాదళం, వైమానిక దళానికి చెందిన పలువురు సిబ్బందికి కూడా సేనా పతకాలు ప్రకటించారు.

**89 మందికి ప్రత్యేక గుర్తింపు**

విశిష్ట సేవలకు గుర్తింపుగా 89 'మెన్షన్స్ ఇన్ డిస్పాచెస్'కు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. వీరిలో 75 మంది సైన్యానికి, నలుగురు నౌకాదళానికి, 10 మంది వైమానిక దళానికి చెందినవారు ఉన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేళ ప్రకటించిన ఈ పురస్కారాలు దేశ రక్షణలో సేవలందిస్తున్న సాయుధ దళాల సిబ్బంది ధైర్యసాహసాలకు గౌరవ సూచకంగా నిలవనున్నాయి.

# 'బొద్దింక' వ్యాఖ్యలపై సీజేఐ వివరణ

- తన వ్యాఖ్యలను వక్రీకరించారన్న సూర్యకాంత్
- యువతను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేశారని ఆవేదన
- కోర్టు కార్యకలాపాల అసంపూర్ణ వీడియోలపై ఆందోళన
- మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన
- హక్కులతో పాటు బాధ్యతలు గుర్తుంచుకోవాలని పిలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 15:





తన 'బొద్దింక' వ్యాఖ్యలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మరోసారి వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను వక్రీకరించి దేశ యువతను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు కార్యకలాపాలకు సంబంధించిన అసంపూర్ణ వీడియో క్లిప్‌లను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. డీడీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజేఐ ఈ అంశాలపై స్పందించారు.

**వ్యాఖ్యలను వక్రీకరించారంటూ..**

మే 15న సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా నకిలీ డిగ్రీల ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరిని సీజేఐ సూర్యకాంత్ 'బొద్దింకలతో' పోలుస్తూ వ్యాఖ్యలు చేశారు. అలాంటి వ్యక్తులు సామాజిక మాధ్యమాలు, ఆర్టీఐ కార్యకర్తల ముసుగులో వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆయన అప్పట్లో పేర్కొన్నారు. అయితే ఆ వ్యాఖ్యలను వక్రీకరించి యువతను 'బొద్దింకలు'గా పోల్చారంటూ తనపై తప్పుడు ప్రచారం జరిగిందని సీజేఐ తాజాగా స్పష్టం చేశారు.

**అసంపూర్ణ క్లిప్‌లపై ఆందోళన**

కోర్టు కార్యకలాపాలకు సంబంధించిన వీడియోలను సందర్భంతో సంబంధం లేకుండా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం సరి కాదని సీజేఐ అన్నారు. తాను చెప్పిన విషయాన్ని వక్రీకరించి యువతను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించడం దురుద్దేశపూరిత చర్యగా అభివర్ణించారు. న్యాయస్థానాల్లో జరిగిన పూర్తి సంభాషణను పరిగణనలోకి తీసుకోకుండా చిన్న వీడియో క్లిప్‌ల ఆధారంగా అభిప్రాయాలు ఏర్పడటం సమస్యలకు దారితీస్తుందని పేర్కొన్నారు.

**హక్కులతో పాటు బాధ్యతలు**

కోర్టు కార్యకలాపాలపై వార్తలు అందించే సమయంలో మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీజేఐ సూచించారు. సమాజంలో సామరస్యాన్ని కాపాడటం ప్రతి పౌరుడి హక్కు మాత్రమే కాకుండా రాజ్యాంగపరమైన బాధ్యత కూడా అని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలు, ముద్రిత మాధ్యమాలు లేదా ఇతర వేదికల్లో ఉన్నవారితో పాటు సాధారణ పౌరులకూ హక్కులు, బాధ్యతలు ఉంటాయని చెప్పారు.

**బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**

హక్కులు ముఖ్యమైనవే అయినప్పటికీ వాటిని వినియోగించే క్రమంలో బాధ్యతలను కూడా నిర్వర్తించే సామర్థ్యం ప్రతి ఒక్కరికీ ఉండాలని సీజేఐ సూచించారు. ముఖ్యంగా న్యాయస్థానాల కార్యకలాపాలు, ప్రజా ప్రాధాన్యత కలిగిన

# ఆపరేషన్ సిందూర్‌పై దోవల్ తొలిసారి

- 88 గంటల ఆపరేషన్ వెనుక వ్యూహాలు వెల్లడించనున్న ఎన్ఎస్ఏ
- 'భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దు'
- పహల్గామ్ దాడికి ప్రతిగానే ఆపరేషన్ సిందూర్
- పాక్‌లో ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడ్డ భారత దళాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 15:

పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తొలిసారిగా ఇచ్చిన ఇంటర్వ్యూ 'డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రసారం కానుంది. రెండు భాగాలుగా రూపొందించిన ఈ డాక్యుమెంటరీ సిరీస్ ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు డిస్కవరీ ఛానల్, డిస్కవరీ+లో ప్రసారం కానుంది. దాదాపు 88 గంటల పాటు సాగిన సైనిక చర్య వెనుక వ్యూహాలు, కీలక నిర్ణయాలపై దోవల్ ఇందులో వివరించనున్నారు.

**సహనాన్ని బలహీనతగా చూడొద్దు**

భారత్ సహనంతో వ్యవహరించే దేశమే అయినప్పటికీ బలహీనమైనది కాదని దోవల్ స్పష్టం చేశారు. తమ సహనాన్ని బలహీనతగా భావించవద్దని, అవసరమైతే భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుని గట్టి దెబ్బ కొట్టగలదని పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యులైన సంస్థల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే ఆపరేషన్ సిందూర్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

**ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా..**

2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడికి ప్రతిస్పందనగా మే 7న భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్థాన్, పీఓకేలోని లష్కరే తోయిబా, జైషే మహ్మద్‌కు చెందిన శిక్షణ శిబిరాలు, కార్యాలయాలను భారత దళాలు లక్ష్యంగా చేసుకున్నాయి. అనంతరం పాక్ సైన్యం దాడులకు ప్రయత్నించడంతో భారత క్షిపణులు, యుద్ధ విమానాలు పాకిస్థాన్‌లోని పలు సైనిక స్థావరాలపై దాడులు చేశాయి.

**88 గంటల పాటు సైనిక ఘర్షణ**

భారత్ చేపట్టిన ప్రతిదాడుల్లో పాకిస్థాన్‌లోని పది కంటే ఎక్కువ వైమానిక స్థావరాలు దెబ్బతిన్నాయి. రావల్పిండిలోని నూర్ ఖాన్ వైమానిక స్థావరం కూడా ఈ దాడుల పరిధిలోకి వచ్చింది. అణ్వాయుధ దేశాలైన భారత్, పాకిస్థాన్‌ల మధ్య సుమారు 88 గంటల పాటు సైనిక ఉద్రిక్తత కొనసాగింది. చివరకు కాల్పుల విరమణకు ఇరుదేశాలు అంగీకరించాయి.

# యూపీఐ సేవల్లో తీవ్ర అంతరాయం

- ఆన్‌లైన్ చెల్లింపులు నిలిచిపోయాయంటున్న యూజర్లు
- ఫోన్‌పే, గూగుల్‌పే సహా పలు యాప్‌లలో సమస్యలు
- డబ్బులు కట్ అయ్యాయో లేదో తెలియక వినియోగదారుల ఆందోళన

న్యూఢిల్లీ, ఆగస్టు 15:

దేశవ్యాప్తంగా యూపీఐ ఆధారిత ఆన్‌లైన్ చెల్లింపుల్లో తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు సమాచారం. ఫోన్‌పే, గూగుల్‌పే తదితర యూపీఐ సేవల్లో లావాదేవీలు విజయవంతం కావడం లేదంటూ పలువురు వినియోగదారులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తున్నారు. #UPI, #UPIDown హ్యాష్‌ట్యాగ్‌లతో తమకు ఎదురవుతున్న సమస్యలను పంచుకుంటున్నారు.

**లావాదేవీలు నిలిచిపోతున్నాయంటూ..**

యూపీఐ ద్వారా చెల్లింపులు చేసేందుకు ప్రయత్నించినప్పుడు పిన్ నమోదు చేసిన తర్వాత లావాదేవీ పూర్తికాకుండా లోడింగ్‌లోనే నిలిచిపోతోందని యూజర్లు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో చెల్లింపు విఫలమైందా, ఖాతా నుంచి డబ్బు కట్ అయ్యిందా అనే విషయం కూడా స్పష్టంగా తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అత్యవసర చెల్లింపులకూ ఇబ్బందులు**

ప్రస్తుతం నగదు వెంట తీసుకెళ్లే అలవాటు తగ్గిపోవడంతో యూపీఐ సేవలపై ఆధారపడుతున్న వారికి ఈ అంతరాయం తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా అత్యవసర లావాదేవీలు కూడా పూర్తికాకపోవడంతో వినియోగదారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

**ఎన్‌పీసీఐ స్పందనపై ఆసక్తి**

యూపీఐ సేవల్లో అంతరాయానికి కారణాలు ఏమిటనే దానిపై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. ఈ సమస్యపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్పందించాల్సి ఉంది. సేవలు ఎప్పుడు సాధారణ స్థితికి వస్తాయనే దానిపై వినియోగదారుల్లో ఆసక్తి నెలకొంది.

# నక్సల్స్ రహిత భారత్ దిశగా భారీ విజయం

న్యూఢిల్లీ, ఆగస్టు 14:

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో దేశం సాధించిన ప్రగతి, అంతర్గత భద్రత, ఉగ్రవాదంపై పోరాటం, న్యాయ వ్యవస్థ బాధ్యతలను ప్రస్తావించారు. భారత్‌ను నక్సల్స్ రహిత దేశంగా మార్చే దిశగా సాధించిన పురోగతి అత్యంత కీలక విజయాల్లో ఒకటని పేర్కొన్నారు.

**నక్సలిజంపై కీలక విజయం**

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు వేగంగా మారుతున్నాయని రాష్ట్రపతి తెలిపారు. ముఖ్యంగా బస్తర్ వంటి సున్నిత ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకోవడంతో పాటు స్థానిక ప్రజలు తమ సాంస్కృతిక, సామాజిక కార్యకలాపాల్లో చురుకుగా భాగస్వాములవుతున్నారని చెప్పారు. ఇది దేశంలో చోటుచేసుకుంటున్న సానుకూల మార్పుకు నిదర్శనమని పేర్కొన్నారు.

**ఉగ్రవాదులకు గట్టి హెచ్చరిక**

ఉగ్రవాదులు, వారికి సహకరించే వ్యక్తులు ఎక్కడ దాక్కున్నా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్రపతి హెచ్చరించారు. సరిహద్దుల్లో ఉగ్రవాద మౌలిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడంలో భారత సాయుధ దళాల సామర్థ్యాన్ని 'ఆపరేషన్ సిందూర్' ప్రపంచానికి చాటిచెప్పిందని ప్రశంసించారు. ఖచ్చితమైన లక్ష్య ఛేదన సామర్థ్యంతో దేశ భద్రతకు సైన్యం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

**అందరికీ న్యాయం అందాలి**

ఆర్థిక వనరులు, స్థోమత లేక ఏ ఒక్క పౌరుడు న్యాయానికి దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపైనా ఉందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. సామాన్యులకు సైతం సత్వర న్యాయం అందినప్పుడే ప్రజాస్వామ్య విలువలు మరింత బలోపేతమవుతాయని అన్నారు.

**ఐక్యంగా ముందుకు సాగాలి**

భారత్ 80వ స్వాతంత్ర్య వసంతంలోకి అడుగుపెడుతున్న వేళ దేశ రక్షణ, అంతర్గత భద్రత, సమగ్రాభివృద్ధి కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. దేశ ప్రగతిలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకమని ఆమె పేర్కొన్నారు.

# స్వాతంత్ర వేడుకలను పరిశీలించిన కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :**



జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. జిల్లాలో జరిగే స్వాతంత్య వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారము వికారాబాద్ జిల్లా స్వాతంత్య దినోత్సవ వేడుకలు కల్లెక్టేట్ కార్యాలయ ఆవరణలో జరుపుటకు ఏర్పాట్లు చేయాలనీ, గ్రౌండ్ అంతా డస్ట్ వేసి చదును చేసి సిద్దంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి జిల్లా ఎస్ పి స్నేహ మెహరలతో కలిసి పరిశీలించారు. వేడుకలు నిర్వహించనున్న ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్ , ఎస్ పి ఏర్పాట్ల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేదిక, సీటింగ్, డెకరేషన్, పరేడ్, బందోబస్తు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పా టు, కార్యక్రమం విజయవంతంగా జరిగే లా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సంవత్సరం తోలి సారిగా 1. వందే మాతర 2. జనగణ మన 3. జయ జయహే తెలంగాణా, మూడు గీతాలాపనలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు పాల్గొని తమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, డి ఆర్ ఓ స్వర్ణ లత, మహమ్మద్ సత్తార్, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, ఏ ఓ పర్వీన బేగం, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహ రెడ్డి, తహసిల్దార్ లక్ష్మీనారాయణ , పోలీస్ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు

- ఆగస్టు 17 నుంచి ప్రారంభం
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:**



కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలను వారి మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలను ఆగస్టు 17వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా, ఆయా మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమ దరఖాస్తులను సమర్పించే అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాల్లో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించే ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలను నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుదారులకు పారదర్శకంగా సమాచారం అందించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను నిర్దేశిత సమయంలో పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా మండల స్థాయిలోనే ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని సమ ర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

**మండల స్థాయి ప్రజావాణి ముఖ్యాంశాలు**
**ఆగస్టు 17 నుంచి మండల స్థాయి ప్రజావాణి ప్రారంభం**

ప్రతి సోమవారం మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణమండల కేంద్రాల్లోనే దరఖాస్తులు సమర్పించే అవకాశం. ప్రజల సమస్యలకు త్వరిత పరిష్కారం కోసం చర్యలు. దరఖాస్తులపై బాధ్యతాయుతంగా పరిశీలన. పారదర్శక సేవలు, సమయపాలనకు ప్రాధాన్యత. పెండింగ్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను సంబంధిత మండల స్థాయిలో ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తుల రూపంలో సమర్పించి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగం అందిస్తున్న ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

- నోడల్ ఆఫీసర్ షేక్ సలాం



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా నోడల్ ఆఫీసర్ కార్యాలయంలో నోడల్ ఆఫీసర్ షేక్ సలాం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ షేక్ సలాం మాట్లాడారు ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు 3746 రావడం జరిగిందని తెలిపారు, కామారెడ్డి ప్రభుత్వ కళాశాలలో ఒకేషన్లో295 మంది విద్యార్థులు, జనరల్లో663 విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడం జరిగిందని, గర్ల్స్ జూనియర్ కళాశాలలో ఒకేషన్లో 256 మంది విద్యార్థులు జనరల్లో 175 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవడం జరిగిందని తెలిపారు ఇప్పటివరకు 8 వందల మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవడం జరిగిందని 9 వందల మంది విద్యార్థులు 500 నుండి 600 మార్కులు సాధించడం జరిగిందని అన్నారు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా విద్యార్థులకు ఉచితంగా నోటుబుక్స్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు, ప్రభుత్వ కళాశాలపై నమ్మకంతో విద్యార్థి తల్లిదండ్రులు ప్రభుత్వ కళాశాలలో 8 వందలకు పైగా ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు తీసుకున్నందుకు విద్యార్థి తల్లిదండ్రుల కు ప్రత్యేకంగా అభినందనలు కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. మంచి నాణ్యమైన అధ్యాపకులచే ప్రభుత్వ కళాశాలలో మంచి బోధన అందించడం జరుగుతుందని తెలిపారు.



# వరుస చైన్ స్నాచింగ్ కేసులు ఛేదించిన భద్రాద్రి పోలీసులు

**8 మంది అరెస్ట్..**

**రూ.26 లక్షల సొత్తు స్వాధీనం**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 14:**

జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్, చోరీ కేసులను పోలీసులు ఛేదించి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 150 గ్రాముల బరువున్న ఆరు బంగారు గొలుసులు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.26 లక్షలని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ప్రధాన నిందితుడు సున్నం నాగేంద్రబాబు తన సహచరులతో కలిసి రాత్రివేళ ఇళ్ల బయట నిద్రిస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని గొలుసులు చోరీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అతనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 83 దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ ముఠాకు సంబంధించి 10 కేసులను ఛేదించగా, మరో నిందితుడు తమ్మిశె

# చందానగర్ మలబార్ గోల్డ్‌లో "ఆర్టిస్ట్రీ" జువెలరీ షో ప్రారంభం





**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :**

చందానగర్ లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో "ఆర్టిస్ట్రీ" బ్రాండెడ్ జువెలరీ ప్రదర్శన ప్రారంభమైంది. సీరియల్ యాక్టర్ శోభా శెట్టి ముఖ్య అతిథిగా పాల్గొని షోను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో "మైన్" డైమండ్స్, "ఎరా" వెడ్డింగ్ కలెక్షన్, "ప్రిఫెక్ట్" జాతిరత్నాలు, "ఎలిత్" హస్తకళా ఆభరణాలు, "జోయల్", "డైమన్", "స్టార్లెట్" చిల్డ్రన్ జ్యువెలరీ వంటి ప్రత్యేక కలెక్షన్స్ ప్రదర్శించారు. "ఆర్ట్ ఇన్ ఎవ్రీ జెవెల్" అనే థీమ్ తో రూపొందించిన ఈ ఆభరణాలు అత్యాధునిక డిజైన్లతో ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శన ఆగస్టు 14 నుండి 24, 2026 వరకు చందానగర్ మలబార్ గోల్డ్ షోరూమ్‌లో జరుగుతుంది. వినియోగదారులకు 12 నాణ్యత వాగ్దానాలు, హాల్‌మార్క్ గోల్డ్, బైబ్యాక్ గ్యారెంటీ, జీవితకాల ఉచిత సేవలు అందిస్తామని మలబార్ ప్రతినిధులు తెలిపారు.

# ఎంఆర్పీఎస్ మాదాపూర్ డివిజన్ బాధ్యతలు చేపట్టిన ఎలిమెల ప్రశాంత్



**మాదాపూర్, రాజముద్ర న్యూస్ :**

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి – ఎంఆర్పీఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గం, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడిగా ఎలిమెల ప్రశాంత్ నియమితులయ్యారు. ఎంఆర్పీఎస్ జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు ఆయన నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. నియామకం అనంతరం ఎలిమెల ప్రశాంత్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు మోహన్, రాష్ట్ర కార్యదర్శి బాచుపల్లి యాదయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు పుస్తకాలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యాదయ్య

**విద్యార్థులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలి: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**





**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:**

చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామంలో ఉన్న మైనారిటీ గురుకుల బాలికల విద్యాలయం, హాస్టల్‌లో శుక్రవారం విద్యార్థులకు వివిధ రకాల విద్యా సామగ్రి, నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌తో పాటు పలు రకాల స్టేషనరీ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు, బూట్లు, రంగు పెన్సిళ్లు పంపిణీ చేశారు. విద్యార్థుల హాస్టల్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పరుపులు, దుప్పట్లు, కార్పెట్లు, టవళ్లు కూడా అందించారు. అదేవిధంగా విద్యార్థులకు భోజన సౌకర్యాలు మెరుగుపడేలా భోజన తాలి, ప్లేట్లు, జగ్గులు, చెంచాలు, బౌల్స్ తదితర భోజన సామగ్రిని అందజేశారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ...విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలని సూచించారు. ముఖ్యంగా బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి, పౌష్టికాహారం, అవసరమైన మౌలిక వసతులు అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాల్సిన అవసరం ఉందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యార్థులకు అందించిన పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు, బూట్లు, దుప్పట్లు, కార్పెట్లు, టవళ్లు, భోజన తాలి, ప్లేట్లు, జగ్గులు, చెంచాలు, బౌల్స్, రంగు పెన్సిళ్లు తదితర సామగ్రి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడంతో హాస్టల్‌లో వారికి మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని, విద్యా ర్థులు చదువుపై మరింత శ్రద్ధ పెట్టేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ షాబాద్ సోని దర్శన్, మున్సిపల్ కమిషనర్ అహ్మద్ జాకీర్, మున్సిపల్ కౌన్సిలర్లు గీత, వనజాక్షి, పావని రెడ్డి, అరుణ రామకృష్ణ, వెంకటాపూర్ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ జైపాల్ రెడ్డి, పెద్దమంగళం గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టీడీఆర్ సర్టిఫికెట్ల జారీలో సమూల మార్పులు

**హైదరాబాద్, ఆగస్ట్ 14 :**

హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండిఏ) పరిధిలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలును వేగవంతం చేసేందుకు, భూసేకరణ ప్రక్రియను మరింత సరళతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ (టీడీఆర్) జారీ, వినియోగానికి సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ (మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్మెంట్, ప్లానింగ్–III) శాఖ జీవో ఎంఎస్ నంబర్ 218ను జారీ చేసింది. ఈ ఉత్తర్వులు 2026 ఆగస్టు 14న వెలువడ్డాయి. తెలంగాణ బిల్డింగ్ రూల్స్–2012లోని రూల్ 17(సి)కి ఈ జీవో ద్వారా సవరణలు చేశారు.

**హెచ్ఎండీఏకు నేరుగా టీడీఆర్ జారీ అధికారం**

కొత్త ఉత్తర్వుల ప్రకారం, హెచ్ఎండీఏ చేపట్టే ప్రాజెక్టుల కోసం అవసరమైన లేదా స్వాధీనం చేసుకున్న భూములకు సంబంధించి టీడీఆర్ సర్టిఫికెట్లను ఇకపై హెచ్ఎండీఏ నేరుగా జారీ చేయనుంది. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (సీయూఆర్ఈ), పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (పీయూఆర్ఈ) పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. దీంతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, మెట్రో, ప్రభుత్వ భవనాలు వంటి ప్రజా ప్రయోజన ప్రాజెక్టుల కోసం యజమానులు స్వచ్ఛందంగా అప్పగించిన లేదా స్వాధీనం చేసుకున్న భూములకు సైతం హెచ్ఎండీఏనే టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ జారీ చేసే ఈ సర్టిఫికెట్లను ఆ సంస్థ పరిధిలో ఎక్కడైనా వినియోగించుకోవడానికి లేదా బదిలీ (డిస్పోజ్) చేసుకోవడానికి యజమానులకు వెసులు బాటు లభించనుంది. అయితే ఇది తెలంగాణ బిల్డింగ్ రూల్స్–2012తో పాటు ఇతర చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ఉంటుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.



# తెలంగాణ ఉద్యమ జ్వాల.. శ్రీకాంతాచారి

నేడు మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి జయంతి

## 'జై తెలంగాణ' నినాదంతో ఆత్మత్యాగం

ఆయన బలిదానంతో ఉవ్వెత్తున ఎగిసిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం

## తెలంగాణ చరిత్రలో చెరగని త్యాగమూర్తి

**తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ ఉద్యమ చరిత్రలో కాసోజు శ్రీకాంతాచారి పేరు చెరగని అక్షరాలతో నిలిచిపోయింది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించిన ఆయన మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. ఆగస్టు 15 శ్రీకాంతాచారి జయంతి సందర్భంగా ఆయన త్యాగాన్ని తెలంగాణ సమాజం మరోసారి స్మరించుకుంటోంది.**

నల్గొండ జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన కాసోజు వెంకటచారి, శంకరమ్మ దంపతుల పెద్ద కుమారుడిగా 1986 ఆగస్టు 15న శ్రీకాంతాచారి జన్మించారు. సాధారణ కుటుంబంలో పుట్టిన ఆయన చిన్ననాటి నుంచే చురుకుగా ఉండేవారు. సమాజ సేవలో ముందుండటంతోపాటు తన వద్ద ఉన్నదానిలో ఇతరులకు సాయం చేసే స్వభావం కలిగి ఉండేవారు. స్థానికంగా ప్రాథమిక విద్య పూర్తిచేసి మోత్కూరు, నకిరేకల్ ప్రాంతాల్లో చదువుకున్నారు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత రాజకీయ, విద్యార్థి ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. తొలుత బీజేపీలో, అనంతరం టీఆర్ఎస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా జరిగిన ఉద్యమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

### తెలంగాణే ఊపిరిగా..

శ్రీకాంతాచారి నిత్యం తెలంగాణ గురించే ఆలోచించేవారని సన్నిహితులు గుర్తుచేసుకుంటారు. తెలంగాణ పాటలు పాడటం, నినాదాలు చేయడం, కవితలు రాయడం ఆయన జీవితంలో భాగమయ్యాయి. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష ఆయనలో బలంగా నాటుకుపోయింది. 2009లో తెలంగాణ ఉద్యమం కీలక మలుపు తిరిగింది. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష, అనంతరం చోటుచేసుకున్న అరెస్టులు, ఉద్యమకారులపై పోలీసుల చర్యలు శ్రీకాంతాచారిని తీవ్రంగా కలచివేశాయి. 2009 నవంబరు 29న హైదరాబాద్ ఎల్బీనగర్ చౌరస్తాలో జరిగిన నిరసన సందర్భంగా శ్రీకాంతాచారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. మంటల్లో చిక్కుకున్న సమయంలోనూ 'జై తెలంగాణ' అంటూ నినదించిన ఘటన ఉద్యమకారులను కదిలించింది. తీవ్ర కాలిన గాయాలతో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన ఆయన ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాడారు. చివరకు 2009 డిసెంబర్ 3 రాత్రి తుదిశ్వాస విడిచారు.

### త్యాగంతో రగిలిన ఉద్యమం

శ్రీకాంతాచారి ఆత్మత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఆయన మరణవార్తతో తెలంగాణ ప్రాంతంలో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజాసంఘాల్లో ఉద్యమావేశం మరింత పెరిగింది. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన త్యాగం ఒక కీలక జ్ఞాపకంగా నిలిచిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా శ్రీకాంతాచారి పేరు ఉద్యమ త్యాగానికి ప్రతీకగా వినిపిస్తూనే ఉంది. రాష్ట్ర సాధన చరిత్రను చెప్పుకునే ప్రతిసారీ ఆయన బలిదానం గుర్తుకొస్తుంది. ఆగస్టు 15 దేశానికి స్వాతంత్ర్య దినోత్సవం... అదే రోజు తెలంగాణ ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన శ్రీకాంతాచారి జన్మదినం. ఆయన జీవితం చిన్నదే అయినా.. తెలంగాణ కోసం చేసిన త్యాగం మాత్రం తరతరాలకు గుర్తుండిపోతుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# స్వాతంత్ర్య సంబరాలకు మహాత్ముడు ఎందుకు దూరం?


## దేశమంతా పండుగ.. గాంధీ మనసంతా విభజన వేదన

ఢిల్లీలో స్వేచ్ఛా సంబరాలు.. బెంగాల్‌లో శాంతి కోసం మహాత్ముడి ప్రయత్నం

హిందూ-ముస్లిం రక్తపాతం మధ్య వేడుకలకు ఎలా రావాలన్న గాంధీ

దేశ విభజన కలచివేయడంతో ప్రార్థన, ఉపవాసంతో గడిపిన స్వాతంత్ర్య దినం

1947 ఆగస్టు 15న చరిత్రలో నిలిచిపోయిన మహాత్ముడి మౌనం



రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలనకు తెరపడింది. దశాబ్దాల స్వాతంత్ర్య పోరాటం ఫలించింది. 1947 ఆగస్టు 15న భారతావని స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. దేశమంతా ఆనందోత్సాహాలతో ఉప్పొంగింది. ఢిల్లీలో చారిత్రక వేడుకలు జరిగాయి. కానీ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచడంలో కీలకపాత్ర పోషించిన మహాత్మా గాంధీ మాత్రం ఆ సంబరాల్లో కనిపించలేదు. దేశమంతా పండుగ చేసుకుంటున్న వేళ ఆయన ఎందుకు దూరంగా ఉన్నారన్నది చరిత్రలో ఆసక్తికరమైన, అంతకుమించి విషాదకరమైన అధ్యాయం. దేశ విభజనను చివరి వరకు వ్యతిరేకించిన గాంధీకి స్వాతంత్ర్యంతోపాటు భారత్ రెండు ముక్కలు కావడం తీవ్ర వేదన కలిగించింది. హిందువులు, ముస్లింల మధ్య ఐక్యతతో కూడిన భారతదేశాన్నే ఆయన కోరుకున్నారు. విభజనను నివారించేందుకు మహమ్మద్ అలీ జిన్నాకు ప్రభుత్వ నాయకత్వ బాధ్యతలు అప్పగించే అవకాశాన్ని కూడా పరిశీలించాలని గాంధీ సూచించిన సందర్భాలున్నాయి. కానీ అప్పటికే రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. కాంగ్రెస్, ముస్లిం లీగ్, బ్రిటిష్ పాలకుల మధ్య జరిగిన పరిణామాలు చివరకు విభజనకు దారితీశాయి.

### ఢిల్లీలో ఆనందం.. బెంగాల్‌లో రక్తపాతం

స్వాతంత్ర్యం సమీపిస్తున్న సమయంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో మత ఘర్షణలు చెలరేగాయి. ముఖ్యంగా బెంగాల్, పంజాబ్ ప్రాంతాల్లో పరిస్థితులు తీవ్రంగా మారాయి. హిందువులు, ముస్లింల మధ్య హింసను నిలువరించడమే తన ముందున్న అతిపెద్ద బాధ్యతగా గాంధీ భావించారు. 1946 నుంచే ఆయన బెంగాల్, బీహార్ తదితర హింస ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. వృద్ధాప్యాన్ని కూడా లెక్కచేయకుండా గ్రామాలు తిరిగి హిందూ, ముస్లిం వర్గాలతో మాట్లాడారు. ప్రతీకారం సమస్యకు పరిష్కారం కాదని, మతసామరస్యమే దేశాన్ని నిలబెడుతుందని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. 1947 ఆగస్టు నాటికి ఆయన కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్నారు. దేశ రాజధానిలో స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు జరుగుతుంటే గాంధీ మాత్రం మతహింసను ఆపేందుకు ప్రజల మధ్యే ఉండిపోయారు.

### ఇక్కడ మనుషులు చస్తుంటే..

తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గాంధీ హాజరుకావాలని కాంగ్రెస్ నాయకులు కోరుకున్నారు. కానీ ఆయన ప్రాధాన్యం వేడుకలకంటే మతహింసను నిలువరించడానికే ఇచ్చారు. హిందూ, ముస్లింలు పరస్పరం ప్రాణాలు తీసుకుంటున్న సమయంలో తాను సంబరాల్లో ఎలా పాల్గొనగలనన్న భావనతో ఢిల్లీకి వెళ్లలేదు. పత్రికలు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా సందేశం కోరినా గాంధీ ఉత్సాహభరితమైన సందేశం ఇచ్చేందుకు సిద్ధపడలేదు. స్వేచ్ఛ వచ్చిన ఆనందం ఉన్నప్పటికీ దేశ విభజన, మతహింస ఆయనను తీవ్రంగా కలచివేశాయి.

### దేశం మేల్కొన్న వేళ..

1947 ఆగస్టు 14 అర్ధరాత్రి ఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ చారిత్రక 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' ప్రసంగం చేశారు. కొత్త భారతదేశం ఆవిర్భావాన్ని ప్రపంచానికి ప్రకటించారు. దేశమంతా ఆ చారిత్రక క్షణాన్ని ఆసక్తిగా వీక్షించింది. కానీ గాంధీ మాత్రం ఢిల్లీ వెలుగులకు దూరంగా ఉన్నారు. స్వాతంత్ర్య దినాన్ని ఆయన ప్రార్థన, ఉపవాసం, శాంతి ప్రయత్నాలతో గడిపారు. ఆయన దృష్టిలో బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందడం మాత్రమే స్వాతంత్ర్యం కాదు. హిందువులు, ముస్లింలు సోదరభావంతో జీవించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యానికి అర్థముంటుంది.

### వేడుకలకంటే మనుషుల ప్రాణాలే ముఖ్యం

తాను జీవితాంతం అహింసను ఆయుధంగా చేసుకుని పోరాడిన దేశంలోనే స్వాతంత్ర్యం వచ్చే సమయంలో మతం పేరుతో మనుషులు ఒకరినొకరు చంపుకోవడం గాంధీని తీవ్రంగా బాధించింది. అందుకే ఢిల్లీలో జరిగే అధికారిక సంబరాల కంటే హింసతో అట్టుడుకుతున్న ప్రాంతంలో ఉండటానికే ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. అందుకే 1947 ఆగస్టు 15 భారత చరిత్రలో రెండు భిన్న దృశ్యాలను మిగిల్చింది. ఢిల్లీలో స్వాతంత్ర్యపు వెలుగులు వెలిగితే.. బెంగాల్‌లో మతసామరస్యం కోసం మహాత్ముడు నడిచారు. దేశం స్వేచ్ఛను వేడుకగా జరుపుకుంటే.. గాంధీ మాత్రం విభజన గాయాలకు మందు వేసే ప్రయత్నంలో ఉన్నారు. **అదే తొలి స్వాతంత్ర్య దినోత్సవానికి మహాత్ముడు దూరంగా ఉండటానికి అసలు కారణం.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# భారత జాతీయ పతాక తయారీ, నిబంధనలు

**భారతదేశ సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్యానికి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా రెపరెపలాడే మువ్వన్నెల జెండా ప్రతి భారతీయుడి గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. కాషాయం, తెలుపు, పచ్చ రంగులతో మధ్యలో 24 ఆకుల నీలిరంగు అశోక చక్రంతో కనిపించే జాతీయ పతాకం వెనుక ప్రత్యేక చరిత్రతోపాటు దాని తయారీ, వినియోగానికి నిర్దిష్టమైన నియమాలు ఉన్నాయి.**

### 1947 జూలై 22న ఆమోదం

ప్రస్తుతం మనం చూస్తున్న జాతీయ పతాక రూపాన్ని 1947 జూలై 22న రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15 నుంచి అధికారిక జాతీయ పతాకంగా వినియోగంలోకి వచ్చింది. అనంతరం భారత గణతంత్రానికి కూడా ఇదే పతాకం జాతీయ చిహ్నంగా కొనసాగింది. జెండా దీర్ఘచతురస్రాకారంలో ఉంటుంది. పైభాగంలో కాషాయం, మధ్యలో తెలుపు, కింద పచ్చ రంగు సమాన నిష్పత్తిలో ఉంటాయి. తెలుపు రంగు మధ్యలో నేవీ నీలం రంగులో 24 ఆకులతో కూడిన అశోక చక్రం ఉంటుంది. పతాకం పొడవు, వెడల్పుల నిష్పత్తి 3:2గా ఉంటుంది.

### తయారీలోనూ కచ్చితమైన ప్రమాణాలు

జాతీయ పతాకం తయారీ విషయంలో భారత ప్రమాణాల సంస్థ నిర్దేశించిన ప్రమాణాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. రంగుల ఛాయలు, అశోక చక్రం ఆకృతి, పతాక కొలతలు తదితర అంశాలకు ప్రమాణాలు నిర్దేశించారు. తయారైన జెండా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాల్సి ఉంటుంది. కాలానుగుణంగా జాతీయ పతాక తయారీ నిబంధనల్లోనూ మార్పులు వచ్చాయి. ఒకప్పుడు చేతితో నేసిన ఖాదీ వస్త్రానికే పరిమితమైన నిబంధనలను తర్వాత సవరించారు. ప్రస్తుతం జాతీయ పతాక నియమావళిలో చేసిన మార్పుల ప్రకారం చేతితో నేసిన లేదా యంత్రంతో తయారుచేసిన పత్తి, పాలిస్టర్, ఉన్ని, పట్టు, ఖాదీ బంటింగ్‌తో కూడా జాతీయ పతాకాన్ని తయారు చేయవచ్చు.



### పౌరులకూ జెండా ఎగురవేసే హక్కు

ఒకప్పుడు సాధారణ ప్రజలు జాతీయ దినోత్సవాలు మినహా అన్ని రోజుల్లో జెండాను ఎగురవేసే విషయంలో పరిమితులు ఉండేవి. పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ సాగించిన న్యాయపోరాటం అనంతరం ఈ విషయంలో కీలక మార్పులు వచ్చాయి. 2002 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిన జాతీయ పతాక నియమావళితో పతాక గౌరవానికి భంగం కలగకుండా సాధారణ పౌరులు కూడా జాతీయ పతాకాన్ని ప్రదర్శించేందుకు అవకాశం లభించింది. జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేయడం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమని సుప్రీంకోర్టు పేర్కొన్నప్పటికీ అది సంపూర్ణమైన, అపరిమితమైన హక్కు కాదు. జాతీయ పతాక గౌరవాన్ని పరిరక్షించే చట్టాలు, నియమాలకు లోబడే ఆ హక్కును వినియోగించుకోవాలి.

### జెండా విషయంలో ఇవి తప్పనిసరి

జాతీయ పతాకాన్ని నేలకు లేదా నీటికి తాకేలా చేయకూడదు. చిరిగిన, మాసిపోయిన లేదా దెబ్బతిన్న పతాకాన్ని ప్రదర్శించకూడదు. జెండాను అలంకరణ వస్తువుగా లేదా వస్తువులను చుట్టేందుకు ఉపయోగించరాదు. పతాకంపై అక్షరాలు రాయడం, దాని గౌరవానికి భంగం కలిగే విధంగా ఉపయోగించడం కూడదు. ఇతర జెండాలతో ప్రదర్శించినప్పుడు కూడా జాతీయ పతాకానికి నిర్దేశించిన గౌరవం తప్పనిసరిగా పాటించాలి.

### పాడైన జెండాను పారేయొద్దు

జాతీయ పతాకం చిరిగిపోయినా, పాడైపోయినా చెత్తలో పడేయడం తగదు. దాని గౌరవానికి భంగం కలగని విధంగా వ్యక్తిగతంగా పూర్తిగా నాశనం చేయాలి. జాతీయ పతాక నియమావళి ప్రకారం దహనం చేయడం లేదా పతాక గౌరవాన్ని కాపాడే ఇతర సముచిత పద్ధతిని అనుసరించవచ్చు.

### మువ్వన్నెలు.. మన గౌరవం

జాతీయ పతాకం కేవలం మూడు రంగుల వస్త్రం కాదు. స్వాతంత్ర్య పోరాటం, త్యాగాలు, దేశ సమైక్యత, సార్వభౌమత్వానికి అది నిలువెత్తు ప్రతీక. అందుకే జెండాను ఎగురవేయడం ఎంత గర్వకారణమో.. దాని గౌరవాన్ని కాపాడటం కూడా అంతే బాధ్యత. మువ్వన్నెల పతాకం రెపరెపలాడిన ప్రతిసారీ దేశం కోసం త్యాగం చేసిన తరాల చరిత్రను గుర్తుచేసుకోవడమే దానికి మనం ఇచ్చే నిజమైన గౌరవం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తొలి టెస్టు టీమ్‌లో బిగ్ సర్‌ప్రైజ్



## సీనియర్‌కు నో ప్లేస్, కొత్త కుర్రాడు అరంగేట్రం!

**గాలే, ఆగస్టు 14:** శ్రీలంకతో శనివారం నుంచి గాలే వేదికగా ప్రారంభం కానున్న తొలి టెస్టుకు టీమిండియా తుది జట్టు ఎలా ఉండబోతుందన్న ఆసక్తి అందరిలో పెరిగింది. ఈ క్రమంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన ప్లేయింగ్ ఎలెవన్‌ను వెల్లడించాడు. అయితే యాష్ జట్టులో ఊహించని మార్పులు ఉన్నాయి. ముఖ్యంగా సీనియర్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణను అశ్విన్ తుది జట్టులోకి తీసుకోకపోవడం అందరి షాక్‌కు గురిచేసింది. సాయి సుదర్శన్ గాయం కారణంగా సర్ఫరాజ్ ఖాన్ తిరిగి భారత టెస్టు జట్టులోకి వచ్చాడు. దీంతో నంబర్-6 స్థానంపై ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ మధ్య పోటీ నెలకొంది. అయితే అశ్విన్ మాత్రం సర్ఫరాజ్ కంటే జురెల్‌నే ఎంపిక చేశాడు. ఉపఖండ పరిస్థితుల్లో సర్ఫరాజ్‌కు ఉన్న అనుభవం, స్పిన్‌ను ఎదుర్కొనే నైపుణ్యం ఉన్నప్పటికీ.. తుది జట్టులో జురెల్‌కు ప్రాధాన్యం ఇచ్చాడు. ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్‌ను ఆర్ అశ్విన్ ఎంచుకున్నాడు. మూడో స్థానంలో సాయి సుదర్శన్ స్థానాన్ని దేవదత్ పడిక్కల్‌తో భర్తీ చేశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. రిషభ్ పంత్ ఐదో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్‌గా ఆడనుండగా.. ధ్రువ్ జురెల్ ఆరో స్థానంలో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా బరిలోకి దిగుతాడని అశ్విన్ చెప్పాడు. పంత్, జురెల్ ఇద్దరికీ యాష్ ఒకేసారి తుది జట్టులోకి చోటిచ్చాడు. సర్ఫరాజ్ ఖాన్ చాలా కాలం తర్వాత తిరిగి జట్టులోకి వచ్చినప్పటికీ.. తొలి టెస్టులో అతడికి చోటు ఇవ్వలేదు ఆర్ అశ్విన్. ధ్రువ్ జురెల్ ఇటీవలి ఫామ్‌పై ప్రశ్నలు ఉన్నప్పటికీ.. అతడి వికెట్ కీపింగ్ సామర్థ్యం, బ్యాటింగ్‌లో ఉన్న అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జట్టులోకి తీసుకోవచ్చని చెప్పాడు. రవీంద్ర జడేజా, మానవ్ సుతార్‌లను స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్లుగా.. కుల్దీప్ యాదవ్‌ను స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఎంపిక చేశాడు. గాలే పిచ్ టెస్ట్ మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో ఈ కాంబినేషన్ వర్కౌట్ అవుతుందని అశ్విన్ భావించాడు. అశ్విన్ జట్టులో బిగ్ సర్‌ప్రైజ్ గుర్నూర్ బ్రార్ ఎంపిక. సీనియర్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణకు బదులుగా గుర్నూర్‌ను తుది జట్టులోకి తీసుకున్నాడు. శ్రీలంకతో జరిగే తొలి టెస్టులో గుర్నూర్ టెస్టు అరంగేట్రం చేయవచ్చని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. మహ్మద్ సిరాజ్‌తో కలిసి గుర్నూర్ కొత్త బంతిని పంచుకోనున్నాడని చెప్పాడు. వార్మప్ మ్యాచ్‌లో తన వేగం, బౌన్స్‌తో శ్రీలంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన గుర్నూర్. తొలి టెస్టులో మరింత ప్రభావవంతంగా బౌలింగ్ చేస్తాడని యాష్ పేర్కొన్నాడు.

### అశ్విన్ ప్లేయింగ్ ఎలెవన్:

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్.

# రూ.100కే ఫుట్‌బాల్ క్లబ్!



- జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీ వాటాల బదిలీకి టాటా స్టీల్ నిర్ణయం
- చర్చిల్ బ్రదర్స్‌తో కుదిరిన ఒప్పందం
- లైసెన్స్‌తోపాటు 12 మంది ఆటగాళ్లు, ఇద్దరు కోచ్‌ల కాంట్రాక్టులూ బదిలీ
- అనుమతులు వస్తే మళ్లీ అగ్రశ్రేణి లీగ్‌లోకి గోవా క్లబ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత ఫుట్‌బాల్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాటా స్టీల్ యాజమాన్యంలోని జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీకి సంబంధించిన పూర్తి వాటాలను కేవలం రూ.100 టోకెన్ ధరకు గోవాకు చెందిన చర్చిల్ బ్రదర్స్‌కు బదిలీ చేసేందుకు టాటా స్టీల్ డైరెక్టర్ల కమిటీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఇరు యాజమాన్యాల మధ్య ఒప్పందం కుదిరింది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య నుంచి అవసరమైన అనుమతులు లభిస్తే 15 రోజుల్లో బదిలీ ప్రక్రియ పూర్తయ్యే అవకాశముంది. ఈ ఒప్పందంలో భాగంగా జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీకి ఉన్న అగ్రశ్రేణి లీగ్ స్పోర్టింగ్ లైసెన్స్‌తోపాటు 12 మంది ఆటగాళ్లు, ఇద్దరు కోచ్‌ల ఒప్పందాలు కూడా చర్చిల్ బ్రదర్స్‌కు బదిలీ కానున్నాయి. దీంతో చర్చిల్ బ్రదర్స్ తిరిగి దేశ అగ్రశ్రేణి ఫుట్‌బాల్ పోటీల్లో అడుగుపెట్టేందుకు మార్గం సుగమం కానుంది. క్లబ్ స్థాయి వృత్తిపరమైన ఫుట్‌బాల్ నుంచి వైదొలగాలని టాటా స్టీల్ నిర్ణయించుకోవడమే ఈ పరిణామానికి కారణంగా తెలుస్తోంది. ఇకపై టాటా ఫుట్‌బాల్ అకాడమీ ద్వారా క్షేత్రస్థాయి, యువజన ఫుట్‌బాల్ అభివృద్ధి, కొత్త ప్రతిభను వెలికితీయడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సంస్థ భావిస్తోంది. మరోవైపు చర్చిల్ బ్రదర్స్‌కు ఈ ఒప్పందం కీలక అవకాశంగా మారింది. గతంలో ఐ-లీగ్‌లో సత్తాచాటిన ఆ క్లబ్‌కు పాయింట్ల వివాదం కారణంగా అగ్రశ్రేణి లీగ్‌కు పదోన్నతి దక్కలేదు. తాజాగా జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీ లైసెన్స్ బదిలీకి మార్గం సుగమం కావడంతో మరోసారి అగ్రస్థాయి భారత ఫుట్‌బాల్‌లో సత్తా చాటేందుకు చర్చిల్ బ్రదర్స్ సిద్ధమవుతోంది.

# కంగారూల గడ్డపై తంజిద్ గర్జన!

ఆస్ట్రేలియాపై రికార్డు శతకంతో చెలరేగిన బంగ్లా ఓపెనర్

ఆసీస్‌పై టెస్టు సెంచరీ చేసిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా ఘనత

హసన్ మహమూద్ ఆరు వికెట్లు.. శాంటో 84 పరుగులు

రెండో రోజు ఆట ముగిసేసరికి 153 పరుగుల ఆధిక్యంలో బంగ్లాదేశ్



**డార్విన్, ఆగస్టు 14:** ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ అదరగొడుతోంది. తొలి టెస్టులో ఆతిథ్య జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూల్చిన బంగ్లా.. బ్యాటింగ్‌లోనూ సత్తాచాటి మ్యాచ్‌పై పట్టుబిగించింది. ఓపెనర్ తంజిద్ హసన్ తమీమ్ 101 పరుగులతో రికార్డు శతకం సాధించగా, కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో 84 పరుగులతో రాణించాడు. 23 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు ఆడుతున్న బంగ్లాదేశ్‌కు తంజిద్ చిరస్మరణీయ ఇన్నింగ్స్ అందించాడు. స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్ వంటి పేసర్లను సమర్థంగా ఎదుర్కొని సెంచరీ పూర్తి చేశాడు. దీంతో ఆస్ట్రేలియాపై టెస్టుల్లో శతకం సాధించిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా తంజిద్ రికార్డు సృష్టించాడు. అంతకుముందు హసన్ మహమూద్ 55 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. అనంతరం తంజిద్, శాంటో కీలక భాగస్వామ్యంతో బంగ్లాదేశ్‌ను భారీ స్కోరు దిశగా నడిపించారు. చివర్లో ఆసీస్ బౌలర్లు పుంజుకుని లిటన్ దాస్, ముష్ఫికర్ రహీంను పెవిలియన్‌కు పంపినా బంగ్లా జోరును పూర్తిగా అడ్డుకోలేకపోయారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 6 వికెట్లకు 351 పరుగులు చేసింది. మెహిదీ హసన్ మిరాజ్ 32, హసన్ మహమూద్ 13 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఇప్పటికే 153 పరుగుల ఆధిక్యం సాధించిన బంగ్లాదేశ్ తొలి టెస్టుపై పట్టు బిగించింది.



# గార్డ్‌నర్‌కే క్రికెట్ ఆస్ట్రేలియా మద్దతు

వైస్ కెప్టెన్‌గా కొనసాగించేందుకు నిర్ణయం

వ్యక్తిగత వివాదం జట్టుపై ప్రభావం చూపకుండా జాగ్రత్తలు

జార్జియా వోల్ ఎంపికపై చర్చలకు గార్డ్‌నర్ దూరం

తుది జట్టు ఎంపికలోనూ నిర్ణయాధికారం ఉండదని స్పష్టీకరణ

**సిడ్నీ, ఆగస్టు 14:** వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆరోపణలతో వివాదంలో చిక్కుకున్న ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా మద్దతుగా నిలిచింది. సహచర క్రీడాకారిణి జార్జియా వోల్‌తో గార్డ్‌నర్‌కు సంబంధం ఉందంటూ ఆమె భార్య మోనికా రైట్ చేసిన ఆరోపణల నేపథ్యంలోనూ వైస్ కెప్టెన్‌గా గార్డ్‌నర్‌ను కొనసాగించాలని బోర్డు నిర్ణయించింది. గార్డ్‌నర్ నాయకత్వ బాధ్యతలపై బోర్డు సమావేశంలో చర్చించినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాడ్ గ్రీన్‌బర్గ్ తెలిపారు. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం ఆమెను వైస్ కెప్టెన్‌గా కొనసాగించేందుకే మొగ్గు చూపినట్లు వెల్లడించారు. అయితే వ్యక్తిగత సంబంధాలు జట్టు ఎంపిక, వాతావరణంపై ప్రభావం చూపకుండా క్రికెట్ ఆస్ట్రేలియా కొన్ని జాగ్రత్తలు తీసుకుంది. వైస్ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ తుది జట్టు ఎంపికలో గార్డ్‌నర్‌కు ఎలాంటి నిర్ణయాధికారం ఉండదని స్పష్టం చేసింది. ముఖ్యంగా జార్జియా వోల్ ఎంపిక, జట్టులో ఆమె స్థానం, ప్రదర్శన తదితర అంశాలపై సెలెక్టర్లు లేదా ఇతర అధికారులతో గార్డ్‌నర్ చర్చించకూడదని సూచించింది. జట్టులో అపోహలు, అసౌకర్య పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు బోర్డు పేర్కొంది. మిగిలిన అంశాలను సంబంధిత వ్యక్తుల వ్యక్తిగత వ్యవహారంగానే పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసింది.



# అశ్విన్ ఇంటికి సడన్‌గా పోలీసులు!

వరుస ఫోన్‌కాల్స్‌తో మాజీ స్పిన్నర్‌లో టెన్షన్

'పోలీసులు వచ్చారు' అనగానే ఒక్కసారిగా షాక్

చివరకు విషయం తెలిసి ఊపిరి పీల్చుకున్న అశ్విన్

పాస్‌పోర్టు అందించేందుకే వచ్చారంటూ అసలు విషయం వెల్లడి

**చెన్నై, ఆగస్టు 14:** టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఇంటికి అకస్మాత్తుగా పోలీసులు రావడం ఆయనను కాసేపు కంగారు పెట్టింది. తన ఛానల్ కోసం వీడియో రికార్డు చేస్తున్న సమయంలో జరిగిన ఈ ఆసక్తికర ఘటనను అశ్విన్ స్వయంగా వెల్లడించాడు. వీడియో రికార్డింగ్‌లో ఉండగా ఇంటి సెక్యూరిటీ గార్డు వరుసగా మూడు, నాలుగుసార్లు ఫోన్ చేశాడని అశ్విన్ తెలిపాడు. సాధారణంగా అతడు అన్నిసార్లు ఫోన్ చేయడని, అయితే రికార్డింగ్‌లో బిజీగా ఉండటంతో కాల్స్ పట్టించుకోలేదన్నాడు. అదే సమయంలో భార్య నుంచి కూడా ఫోన్ రావడంతో ఏదో ముఖ్యమైన విషయం జరిగిందని అనుమానం వచ్చిందని చెప్పాడు. తిరిగి భార్యకు ఫోన్ చేయగా ఇంటికి పోలీసులు వచ్చారని చెప్పడంతో ఒక్కసారిగా షాక్‌కు గురైనట్లు అశ్విన్ తెలిపాడు. వెంటనే వారి వద్దకు వెళ్లగా అసలు విషయం తెలిసిందన్నాడు. వీసా కోసం తాను సమర్పించిన పాస్‌పోర్టును తిరిగి అందించేందుకే పోలీసులు వచ్చినట్లు తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నానని వివరించాడు. ఈ సందర్భంగా 'సెలబ్రిటీలకు కూడా ఇలాంటి సాధారణ అనుభవాలు ఎదురవుతాయా?' అని ఓ నెటిజన్ ప్రశ్నించగా.. తాను సాధారణ వ్యక్తిలా జీవించడానికే ఇష్టపడతానని అశ్విన్ సమాధానమిచ్చాడు. అశ్విన్ 2024 డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అనంతరం 2025లో ఐపీఎల్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత్ తరఫున అన్ని ఫార్మాట్లలో కలిపి 287 మ్యాచ్‌లు ఆడి 765 వికెట్లు సాధించాడు.

# అతీంద్రియ శక్తుల హర్రర్ స్టోరీ అగధ

ఈ వారం వరుస చిత్రాలు బాక్సాఫీస్‌కు క్యూ కట్టాయి. వాటిలో 'అగధ' ఒకటి. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఓ యువతి మహాదేవి (కామాక్షి భాస్కర్ల). బాబాయ్ (భానుచందర్) దగ్గర వాళ్ల పిల్లలతో కలిసే పెరుగుతుంది. అనుకోకుండా ఓ రోజు ఓ దైవ శక్తి కనిపించి ఆమెను ఓ కొత్త మార్గంలో నడిపిస్తుంది. అప్పట్నుంచి ఆ శక్తి చెంతనే గడుపుతూ పెరిగి పెద్దదవుతుంది. అక్కడికి ఓ సాధువు వచ్చి కొన్ని యంత్ర, తంత్ర విద్యల్ని నేర్పించి, వాటిని ప్రజల మంచి కోసం ఉపయోగించాలని కోరతాడు. అప్పట్నుంచి ప్రజల్ని వేధించే అతీత శక్తుల నుంచి కాపాడుతూ పేరు సంపాదిస్తుంది. అందుకే ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో మహాదేవి అంటే ఎంతో పేరు. అలాంటి మహాదేవిని పెంచిన బాబాయ్ కుటుంబానికి అగధ అనే అతీత శక్తి నుంచి ముప్పు ఏర్పడుతుంది. గర్భంతో ఉన్న బాబాయ్ కూతురు ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెతోపాటు మరిన్ని మరణాలూ చోటు చేసుకుంటాయి. దాంతో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికని సొంతూరికి వెళ్లాక అక్కడ మహాదేవికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి?ఇంతకీ అగధ ఎవరు?మహాదేవి కుటుంబాన్నే లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి?దైవిక శక్తుల అండ ఉన్న మహాదేవికీ, అగధకీ మధ్య పోరాటం ఎలా సాగింది?ఎవరు గెలిచారన్నది చిత్ర కథ. చాలా రోజుల తర్వాత కేవలం భయాన్ని, థ్రిల్‌ని పంచడమే లక్ష్యంగా రూపొందిన సినిమానే... 'అగధ'. థ్రిల్లర్ సినిమాలకి తగ్గ వేగం ఇందులో కొరవడినా... ఆసక్తిని రేకెత్తించే కథా ప్రపంచంతోనూ, గాఢతతో కూడిన సన్నివేశాలతోనూ సినిమా చాలావరకూ లక్ష్యాన్ని అందుకుందీ చిత్రం. దైవ శక్తికీ, చీకటి శక్తికీ మధ్య సాగే పోరాటం చాలా సినిమాల్లో చూసినా అగధ చుట్టూ మలిచిన హారర్ సన్నివేశాలు, ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు సినిమాని ప్రత్యేకంగా మార్చాయి. హత్యల వెనకున్న అసలు కారణాల్ని మహాదేవి తనకు తెలిసిన విద్యల్ని ఉపయోగిస్తూ పరిశోధించే తీరు సినిమాకి హైలైట్. అసలు గుహలో ఉన్న అగధ ఎవరనే అంశంతోపాటు, ఆ రోజు గుహలోపల ఏం జరిగిందనే విషయాల చుట్టూ సాగే ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు రక్తికట్టిస్తాయి. ముఖ్యంగా కథానాయకుడి పాత్రలో రెండో కోణం, అగధ ఆత్మ తరచూ ఎవరో ఒకరిలోకి దూరిపోయి చేసే హంగామా ఆకట్టుకుంటాయి. అయితే, కథలో ఒక దశ దాటిన తర్వాత ఇన్ని మలుపులా అనిపిస్తాయి. పతాక సన్నివేశాల్లో కాలయంత్రంతో ప్రతినాయకుడిని బంధీగా మార్చడమనే అంశం కొత్తగా ఉంటుంది. మొత్తంగా చాలా రోజుల తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్ సినిమా అనుభూతిని పంచడంలో ఈ




చిత్రం విజయం సాధించింది. కథకుడిగా కంటే దర్శకుడిగా సినిమాపై ప్రభావం చూపించారు ఎం.ఎస్.రాజు. అతీత శక్తులతో కూడిన కథా నేపథ్యం ఆసక్తిని రేకెత్తించినా, కథన రచన పాత పద్ధతుల్లోనే సాగింది. నిర్మాతగా ఆయన సినిమాల్లో కనిపించిన ప్రమాణాలకు తగ్గట్టుగానే, దర్శకుడిగా ఈ సినిమాని నాణ్యంగా తెరపైకి తీసుకొచ్చారు.



# టాక్సిస్ కోసం కియారా చాలా కష్టపడింది



## నటుడు యశ్ ప్రశంసలు

సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# 16న ఇరుముడి ప్రీరిలీజ్ వేడుక




మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఆగస్టు 16న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక వేదికగా 'ఇరుముడి' ప్రీ రిలీజ్ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మల్లెపూల పల్లకి' పాటను విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

# విశ్రాంతిని ఎంజాయ్ చేస్తున్న రష్మిక



టాలీవుడ్ ప్రముఖ నటి రష్మికా మందన్నా ప్రస్తుతం గాయం కారణంగా సినిమాలకు దూరంగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ రెస్ట్ సమయంలో తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఎప్పుడూ తీరిక లేకుండా ఉరుకులు పరుగులతో బిజీగా గడిపేవారికి, ఒక్కసారిగా పనులు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం మొదట్లో చాలా భయంగా అనిపిస్తుందని రష్మిక తెలిపారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో అలా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తే.. గతంలో అలా పిచ్చివాళ్లలా పనుల వెనకే పరిగెత్తిన దినాలు ఇప్పుడు తలచుకుంటే మరింత భయంగా అనిపిస్తాయని, బహుశా జీవితం అంటే ఇదేమో అని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అలారాలు పెట్టుకోకుండా శరీరం కోరిన సమయానికి లేవడం, రోజుకు రెండు పూటల మితంగా భోజనం చేయడం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, ఇష్టమైన షోలు చూడటంతో పాటు పాత ఫోటోలు, వీడియోలను నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతున్నానని చెప్పారు. ఈ కష్టకాలంలో తాను త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ అభిమానులు, శ్రేయోభిలాషులు పంపిస్తున్న ప్రార్థనలకు, చూపుతున్న ప్రేమానురాగాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్ర షూటింగ్‌లో భాగంగా ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా రష్మిక తుంటి భాగంలో గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆమె కొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.

# శ్రీను వైట్ల దర్శకత్వంలో శర్వానంద్



టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన క్రేజీ కాంబినేషన్ అధికారికంగా పట్టాలెక్కింది. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే చార్మింగ్ హీరో శర్వానంద్, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో కూడిన ఎంటర్‌టైనర్లను తెరకెక్కించే ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో తొలిసారిగా కలిసి పనిచేస్తున్నారు. వీళ్లిద్దరి కలయికలో రాబోతున్న ఈ సరికొత్త ప్రాజెక్ట్‌పై టాలీవుడ్ వర్గాల్లో మరియు ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిల్ సుంకర నిర్మాణంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతుండగా తాజాగా ఈ సినిమా టైటిల్‌తో పాటు పూజా కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఇక ఈ సినిమాకు మేకర్స్ 'జార్జ్ క్రిష్' అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. సినిమా ప్రారంభోత్సవ రోజే విడుదల తేదీని ప్రకటించి మేకర్స్ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఈ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. లాంచింగ్ రోజే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో కూడా మంచి బజ్ క్రియేట్ అయింది.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com